వైభవంగా రామయ్య గ్రామోత్సవం



రంగమండపంలో ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 9: ఒంటిమిట్ట కోదండరామాలయంలో ఉగాది సందర్భంగా ఉత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులను ప్రత్యేకంగా అలంకరించి రామాలయం నుంచి పురవీధుల గుండా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారికి గ్రామంలో మహిళలు కాయాకర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంట సుఖసంతోషాలతో తీపి, కారం, వగరుతో తెలుగు సంవత్సరం ప్రారంభం కావాలని, జీవితంలో కష్టసుఖాలను అధిగమించి ముందుకు సాగేందుకు ధైర్యసాహసాలు అందించాలని ఉద్దేశ్యంతో గ్రామోత్సవం నిర్వహించామని అర్చకులు తెలిపారు.

కోదండరామాలయంలో ఉగాది పంచాంగ శ్రవణం

కోదండరామాలయంలో ఉగాదిని పురస్కరించుకుని టీటీడీ అర్చకులు, రామాలయ ఆస్థాన పురోహితులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రంగమండపంలో ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణాన్ని ప్రారంభించారు. ఈ సంవత్సరం రైతులకు పాడి పరిశ్రమలకు శుభదాయకంగా ఉంటుందని, వర్షాభావ పరిస్థితులను అధిగమించి పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయన్నారు. ప్రకృతిలో సంభవించే విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని పంచాంగ శ్రవణాన్ని చేశారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు శ్రావణ్‌కుమార్, వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, గ్రామ పురోహితులు ఏలేశ్వరం గురుస్వామి పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణులు

పండుగ రోజు విషాదం

● చేనేత కార్మికుడి ఆత్మహత్య



మల్లికార్జున మృతదేహం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9: ఉగాది పండుగ రోజు చేనేత కార్మికుడి ఇంట్లో విషాదం నెలకొంది. మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె, మాయాబజార్‌లో ఓ చేనేత కార్మికుడు అప్పుల బాధ భరించలేక ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ కుటుంబంలో పండుగ రోజు విషాదం నెలకొంది. వన్‌టౌన్ సీఐ వలీబాషా వివరాల మేరకు... నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌లో 15 ఏళ్లుగా కాపురం ఉన్న చేనేత కార్మికుడు జి.మల్లికార్జున (42) తన ముగ్గురు కుమార్తెల వివాహాలకు దాదాపు రూ.14 లక్షల వరకు అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక రుణం ఇచ్చిన వారు చేసే ఒత్తిళ్లకు తట్టుకోలేక చేనేత పనులు సక్రమంగా జరగకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం భార్య ఇంట్లో చూడగా భర్త ఉరి వేసుకుని వేలాడుతుండగా ఆమె స్థానికుల సాయంతో కిందకు దించి పోలీసులకు సమాచారం అందజేశారు. అనంతరం మల్లికార్జున మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతడికి భార్య మాధవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆ ముగ్గురికి వివాహాలు చేసి అప్పులు అధికంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రెండో పట్టణ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

టాప్‌గేర్‌లో టీడీపీ...

● ముగిసిన అలకలు, బుజ్జగింపులు..
● కదం తొక్కుతున్న నాయకులు, కార్యకర్తలు
● వైసీపీ నుంచి టీడీపీలోకి పెరిగిన వలసలు
● గెలుపుపై ధీమాలో కూటమి అభ్యర్థులు



(రాయచోటి- ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. దీంతో రెండు మూడు రోజులుగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలోనూ ప్రచారం టాప్‌గేర్‌కు చేరుకుంది. అన్ని చోట్ల ముఖ్య నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు, క్రియాశీల కార్యకర్తలు రాబోయే ఎన్నికల సమరానికి కదం తొక్కుతున్నారు. ఇదే సమయంలో అధికార పార్టీ పట్ల అన్ని వర్గాల ప్రజల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓటమి భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ అధికార పార్టీ నుంచి టీడీపీలోకి వలసలు పెరిగాయి. దీంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తోంది. టికెట్లు రాని నాయకులు, తమ నాయకునికి టికెట్టు రాలేదని అలిగిన ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలతో బుజ్జగింపులు, సంప్రదింపులు ముగియడంతో అందరూ అభ్యర్థుల విజయం కోసం ప్రచారంలో దూసుకుపోతున్నారు.

● రాజంపేట అసెంబ్లీ స్థానానికి తెలుగుదేశం పార్టీ రాయచోటి మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు బాలసుబ్రమణ్యంను అభ్యర్థిగా ప్రకటించింది. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీకి చెందిన ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరుపుతూ ఉన్నారు. బుధవారం నుంచి రాజంపేట పట్టణంలో సుబ్రమణ్యం ప్రచారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆయన సోదరుడు సుగవాసి ప్రసాద్‌బాబు సుండుపల్లె, వీరబల్లి మండలాల్లో ప్రచారం ప్రారంభించారు. రెండు రోజులుగా నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు టీడీపీలో చేరారు. టీడీపీ నాయకుడు పోలి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గానికి చెందిన సుమారు 50 మంది వరకు వైసీపీ ముఖ్య నాయకులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ చేరికలు రాజంపేట టీడీపీలో కొత్త ఉత్సాహాన్ని పెంచాయని చెప్పవచ్చు. ఈ నియోజకవర్గంలో పలువురు నాయకులు టీడీపీ టికెట్టును ఆశించారు. అభ్యర్థితో పాటు పార్టీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుని బుజ్జగింపులు, సంప్రదింపులు జరపడంతో ఆయా నాయకులు, వారి అనుచరులు సుబ్రమణ్యంకు ఇప్పటికే సుమారు 70 శాతం మంది మద్దతు ప్రకటించారు. మిగిలిన వారి కోసం కూడా చర్చలు జరుగుతూ ఉన్నాయి. వైసీపీలో ఉన్న వర్గ విభేదాలు టీడీపీకి కలిసి వస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మరో మూడు, నాలుగు రోజుల్లో నియోజకవర్గంలోని పలువురు వైసీపీ ముఖ్యనాయకులు కూడా పసుపు కండువా కప్పుకోవచ్చని ప్రచారంలో ఉంది. ఎమ్మెల్యే అభ్యర్థి కూటమిలోని పార్టీలు జనసేన, బీజేపీ నాయకులతోనూ సంప్రదింపులు జరిపి మద్దతు కూడగట్టుకున్నారు.

● పొత్తులో భాగంగా రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ముక్కావారిపల్లె సర్పంచ్‌గా ఉన్న అరవ శ్రీధర్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. ఈయన రెండు రోజుల క్రితం ప్రచారం ప్రారంభించారు. టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థి అరవ శ్రీధర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే యువకులు, సీనియర్ పార్టీ నాయకులు, జనసేన పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. సుమారు 100 మంది యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలో చేరారు. టీడీపీకి దూరమైన నాయకులను రూపానందరెడ్డి కలుపుకుని ముందుకు నడిపిస్తున్నారు. విభేదాలు ఉన్న చోట బుజ్జగింపులు, సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించి పార్టీ గెలుపు దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నారు. చాలా కాలంగా కట్టా బాలాజీ టీడీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. ఆయనతో రూపానందరెడ్డి సంప్రదింపులు జరిపి మళ్లీ క్రియాశీలకంగా చేయగలిగారు. అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ రైల్వేకోడూరు తాజా మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, సీనియర్ నాయకులు గడికోట సుబ్బరాయుడు, నాయుడోరి రమణ, వెంకటేశ్వరరాజు, కమతం నాగరాజుయాదవ్ తదితరులు ప్రచార కార్యక్రమాల్లో ముందుండి నడిపిస్తున్నారు. రాబోయే వారం పది రోజుల్లో రూపానందరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి భారీ చేరికలు ఉండబోతున్నట్లు ప్రచారంలో ఉంది.

● మదనపల్లె టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాష ప్రచారంలో వైసీపీ కంటే ముందున్నారు. తనదైన శైలిలో పార్టీలు, వర్గాలు అనే తేడా లేకుండా అందరినీ కలుపుకుని ముందుకెళ్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉండడంతో అప్పటి పాతతరం నేతలు, కార్యకర్తలను కూడా కలుస్తున్నారు. కులసంఘాలు, ప్రజా సంఘాలు, ఒక కమ్యూనిటీలో 10 ఓట్లను ప్రభావితం చేసే కార్యకర్తను సైతం ఇంటికెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ, ముందుకు వెళ్తున్నారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో షెడ్యూల్ ప్రకారం వెళ్తున్నారు. అక్కడ కూడా మీటింగులు పెడుతూ ఇతర పార్టీల నుంచి తటస్థంగా ఉన్న కార్యకర్తలను కూడా పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ వైసీపీ, కాంగ్రెస్ కార్యకర్తలను ఆకట్టుకుని దగ్గరకు చేర్చుకుంటున్నారు. ఇక్కడ ఇప్పటి వరకు పెద్ద స్థాయి వైసీపీ నాయకులు కాకపోయినా. గ్రామ స్థాయి నాయకులు టీడీపీలో చేరుతున్నారు. కురవంక ఎంపీటీసీ సభ్యురాలు హారతి వైసీపీ నుంచి షాజహాన్‌బాషా సమక్షంలో టీడీపీలో చేరారు.

● తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటిస్తూ అసంతృప్తితో ఉన్న నాయకులు, కార్యకర్తలను కలుస్తున్నారు. టికెట్టు రాక అలకబూనిన శంకర్‌యాదవ్ వర్గంతో సంప్రదింపులు జరుపుతున్నారు. అయితే ఇటీవల అభ్యర్థి మార్పు ఉంటుందని ఇక్కడ ప్రచారం జోరుగా ఉంది. అయినా ఇవేమి లేవని పార్టీ వర్గాలు కొట్టివేస్తుండగా, జయచంద్రారెడ్డి మాత్రం తన ప్రచారంలో దూసుకుపోతున్నారు.

● పీలేరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి రెండు నెలలుగా ప్రచారంలో దూకుడు పెంచారు. నియోజకవర్గంలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా చాపకింద నీరులా ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చేరికలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పీలేరు, కేవీపల్లె మండలాల నుంచి వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరుతున్నారు. రెండు, మూడు నెలల క్రితం వరకు కూడా టీడీపీ బలహీనంగా కనిపించిన గ్రామాల నుంచి సైతం కిశోర్‌కుమార్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ చాలా మంది టీడీపీలో చేరుతుండడం విశేషం. కిశోర్ కుమార్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి కూడా జోరుగా ప్రచారం చేస్తోంది.

● రాయచోటి నియోజకవర్గంలో మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, రాంప్రసాద్‌రెడ్డి ఇద్దరూ కలిసి ప్రచారం నిర్వహించారు. దీంతో నియోజవర్గ వ్యాప్తంగా సుగవాసి, మండిపల్లె వర్గాలు టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా పనిచేస్తున్నాయి. ఇదే సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఇప్పటికే వందలాది ముస్లిం మైనార్టీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. మాజీ మునిసిపల్ చైర్మన్ సలావుద్దీన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అన్వర్‌బాష, సీనియర్ నాయకులు కోడిశ్రీను, ప్రైవేటు కళాశాలలు, విద్యాసంస్థల జేఏసీ రాష్ట్ర చైర్మన్ పి.మదన్‌మోహన్‌రెడ్డి వంటి ముఖ్యనాయకులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. రాంప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం తీవ్రంగా పని చేస్తున్నారు. సుగవాసి ప్రసాద్‌బాబు వర్గం కూడా టీడీపీ గెలుపు కోసం పనిచేస్తోంది. ఇదే సమయంలో రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల్లో సైతం టీడీపీకి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నారు.

వేసవి తీవ్రత దృష్ట్యా కంట్రోల్ రూం ఏర్పాటు

● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 9: వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ బారిన పడకుండా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నెంబర్ 08561 293006కు ఫోన్ చేసి తెలపాలన్నారు. అలాగే అవసరమైన అత్యవసర సేవల కొరకు వివిధ శాఖలలో టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశామన్నారు. విపరీతమైన జ్వరం, వడదెబ్బకు గురైతే వెంటనే సంబంధిత పీహెచ్‌సీ సీహెచ్‌సీలకు వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు. వైద్య పరంగా అత్యవసర సేవల కొరకు 108కు ఫోన్ చేయాలన్నారు. వేసవిలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే 101 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 9032430230కు ఫోన్ చేసి తెలపాలన్నారు. వేసవిలో ఎదుర్కొనే వ్యవసాయ, ఉద్యానవన, పశువులకు సంబంధించి సమస్యలకు సంబంధిత ఆర్బీకేలను సంప్రదించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల సమస్యలకు సంబంధించి ఏఈ, డీఈలను సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మే మొదటి వారంలో ఉద్యోగులకు ఓటింగ్

● అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు



కలికిరి, ఏప్రిల్ 9: ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఈసారి ఎన్నికల కమిషన్ కొత్త రకం ఏర్పాట్లు చేస్తోంది. గతంలో పోస్టల్ బ్యాలెట్‌లు అందజేసి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బ్యాలెట్ పెట్టెను ఏర్పాటు చేసేవారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు తమ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన అనంతరం దానిని సీల్డ్ కవర్‌లో ఉంచి ఆ పెట్టెలో వేసే ఆనవాయితీ ఉండేది. అయితే ఈదఫా ఈ ఓటింగ్ విధానాన్ని సమూలంగా మార్చడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకనువుగా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటు వేసేందుకు ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి అనుగుణంగా ఎన్నికల కమిషన్ తాజాగా ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి షెడ్యూలు కూడా ప్రకటించింది. దీని ప్రకారం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు వేయడానికి ఉద్యోగులను నాలుగు విభాగాలుగా విభజించి ఈ ప్రక్రియను కొనసాగించనున్నారు. మే 5వ తేదీ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఈ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంటుంది. అదే విధంగా ఆ మరుసటి రోజు 6వ తేదీ ఇతర పోలింగ్ అధికారులు, 7వ తేదీ పోలీసు శాఖ, అత్యవసర సర్వీసుల శాఖలకు చెందిన వారితో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రైవేటు వ్యక్తులకు ఓటు వేసే అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఇక 8వ తేదీ ఇక్కడ ఎన్నికల విధుల్లో ఉండి, ఇతర జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులకు జిల్లా కేంద్రంలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న వారు ఇక్కడ జిల్లా కేంద్రంలో ఓటు వేసే ప్రక్రియకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను ఉన్నత స్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా 33 శాఖలకు చెందిన అత్యవసర సర్వీసుల విభాగాలకు చెందిన అధికారులను ఎన్నికల విధుల నుంచి మినహాయించారు. అయితే పోలింగ్ రోజు వీరంతా కూడా అత్యవసర విధుల్లో పాల్గొనేందుకు వీలుగా వీరికి కూడా ఫెసిలిటేషన్ కేంద్రాల ద్వారా కొత్తగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు మొదటిసారిగా అవకాశం కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కేంద్రంలోనే ఉద్యోగుల కోసం పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున ఏజెంట్లను కూడా ఈ పోలింగ్ ప్రక్రియలో అనుమతించేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుపై ఉద్యోగుల హర్షం!

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు గతంలో లాగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా కాకుండా ఫెసిలిటేషన్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడాన్ని ఉద్యోగులంతా స్వాగతిస్తున్నారు. గతంలో పోస్టల్ బ్యాలెట్‌లు జారీ చేసినా వాటి కోసం రాజకీయంగా తమ పైన తీవ్ర స్థాయిలో ఒత్తిడులు, ప్రలోభాలు ఉండేవని గుర్తు చేశారు. దీంతో తమ పోస్టల్ బ్యాలెట్‌ల వినియోగంలో పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగేదని కూడా అంగీకరిస్తున్నారు. ఫెసిలిటేషన్ కేంద్రంలో తాము ప్రత్యక్షంగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఇక్కడ కూడా అభ్యర్థుల తరపున ఏజెంట్లను నియమించకుండా ఈఆర్వో, ఏఈఆర్వోల పర్యవేక్షణలోనే ఓటు వేసే విధంగా మరింత పారదర్శకత కల్పించాలని వీరు కోరుతున్నారు. ఈ కొత్త విధానం కారణంగా తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం లభిస్తుందని కూడా చెబుతున్నారు.

ఇంటి వద్ద ఓటు కోసం 29లోగా దరఖాస్తులు

కాగా కొన్ని కేటగిరీల ఓటర్లకు ఈ దఫా కొత్తగా ఇంటి వద్ద నుంచే ఓటు వేసే సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, వికలాంగుల కోసం ఈ సౌలభ్యాన్ని కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ వెసులుబాటు కోసం వీరు ఈనెల 29వ తేదీ లోగా రిటర్నింగ్ అధికారులకు దరఖాస్తులు పంపుకోవలసి ఉంటుంది. ఫారం-12డి ద్వారా వీరు దరఖాస్తులు చేసుకోవలసి ఉంది.

రాజంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

● కల్లబొల్లి మాటలు చెప్పను..
● అన్నిరంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
● రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం



మాట్లాడుతున్న రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యం

రాజంపేట, ఏప్రిల్ 9: రాజంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, కల్లబొల్లి మాటలు చెప్పనని, అభివృద్ధి ఎలా ఉంటుందో రాజంపేట వాసులకు చూపిస్తానని రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం రాజంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరాది సందర్భంగా ఏడాది పొడవునా అందరికీ మంచి జరగాలని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, సౌభాగ్యాలతో వర్ధిల్లాలని భగవంతుడిని కోరుతున్నట్లు తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నాపై ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేయడం తన అదృష్టమని ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాజంపేట నియోజకవర్గ ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. కల్లబొల్లి మాటలు చెప్పడం తనకు చేతకాదని, చేయగలిగిన పనిని చేసి చూపిస్తానన్నారు. తనతో కానీ, తన కుటుంబ సభ్యులతో కానీ ఎవరైనా స్నేహం చేస్తే ఎవ్వరూ వదిలిపోలేరని తమ నిజాయితీని, నిబద్ధతను త్వరలో రాజంపేట ప్రజలు గుర్తిస్తారన్నారు. ఎన్నికల సమయం అతి తక్కువగా ఉన్నందున అందరినీ కలవలేకపోవచ్చని, అయినా సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తామన్నారు. అభివృద్ధిని, నిజాయితీని సేవాతత్పరతను గుర్తించి తనను అన్ని వర్గాల ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, బీజేపీ అగ్రనాయకత్వం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదేశాలు, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో తాను, ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. రాజంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఏ పార్టీ గెలుస్తుందో ఆ పార్టీనే రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న నానుడి రాష్ట్రానికి అంతా తెలుసునని, రాజంపేటలో జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి అభ్యర్థిగా తాను గెలవడం తథ్యమని, అదే విధంగా రాష్ట్రంలో కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంటుందని ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంతో చరిత్ర కలిగిన రాజంపేట నియోజకవర్గాన్ని గత వైసీపీ పాలకుల ఐదేళ్ల పాలనలో సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పాలకుల ఇసుక దాహానికి అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిందని, 40 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని, అనేక మంది గ్రామాల ప్రజలు నేటికీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రాజెక్టు తెగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లు కట్టించలేదని, ఎండకు, వానకు పేద ప్రజలు ఎలా జీవిస్తారని పేర్కొన్నారు. ప్రాజెక్టు బాధిత రైతులకు న్యాయం చేయలేదని, భూముల్లో వేసిన ఇసుక మేటలను కూడా తొలగించలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించడంతో పాటు బాధితులందరికీ న్యాయం చేస్తామని, రైతులను ఆదుకుంటామని తెలిపారు. రాజంపేట జిల్లా కేంద్రం కోసం అసెంబ్లీలో చర్చిస్తానన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాజంపేటలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదని వాపోయారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన వెంటనే రాజంపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాలను సాగు, తాగునీటి పరంగా, అభివృద్ధిపరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, రాజంపేట మున్సిపాలిటీని అత్యంత అభివృద్ధి చెందే మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతానని చెప్పారు. అన్నమయ్య జన్మించిన తాళ్లపాక జన్మస్థలితో పాటు రాజంపేటలోనే స్థిరనివాసం ఉండి ఈ ప్రాంత అభివృద్ధికి, ఔన్నత్యానికి కృషి చేస్తానని, కావున ప్రజలందరూ తనను ఆదరించి ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపించాలని కోరారు.

బీబీ నాంచారమ్మకు పుట్టింటి సారె

● దేవుని కడప ఆలయాన్ని సందర్శించిన ముస్లిం మహిళలు

కడప(కల్చరల్) ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడపలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం పలువురు ముస్లిం మహిళలు సందర్శించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడై కొలువుదీరిన శ్రీవారికి తెల్లవారు జామునే ముస్లిం మహిళలు ప్రత్యేకించి తొలి పూజ నిర్వహించారు. తిరుమలేసుడి రెండవ అర్ధాంగి అయిన బీబీ నాంచారమ్మను ముస్లింలు వారి ఆడబిడ్డగా భావిస్తారు. దీంతో ఉగాది రోజు దేవుని కడపలోని శ్రీవారి ఆలయాన్ని సందర్శించి స్వామివారి సేవలో తరించి ఆడబిడ్డ కానుకలను సమర్పిస్తారు. అందులో భాగంగా బియ్యం, బేడలు, ఉప్పు, చింతపండు, బెల్లంతో పాటు వివిధ రకాల కూరగాయలు సమర్పించారు. ఉగాది పర్వదినాన తమ ఆడబిడ్డ అయిన బీబీ నాంచారమ్మకు పలు దినుసులిచ్చి భక్తితో శ్రీనివాసుడిని దర్శనం చేసుకున్నారు. మా ఆడబిడ్డకు ఎలాంటి కష్టం వాటిల్లకుండా మంచిగా చూసుకోవాలని.. స్వామి వారిని కోరుకుంటామని ముస్లిం మహిళలు వెల్లడించారు.



దినుసులతో ఆలయానికి వచ్చిన ముస్లిం మహిళ, ఆలయంలో స్వామివారి ప్రసాదాన్ని ఆరగిస్తున్న ముస్లింలు



స్వామి వారి దర్శనం కోసం క్యూలో వున్న ముస్లిం మహిళలు

Sitaram Jindal Foundation Scholarship Scheme



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: By post to: The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

SCHOLARSHIP ALERT

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/ private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000 ***Last Date:*** 30-04-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LPUK1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈసారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా **3,712** పోస్టులను భర్తీ చేయనున్నారు.

భర్తీ చేసే పోస్టులు
1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్జూమర్ అఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** ssc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0U9xCcMలో చదవండి.

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.
ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.
ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in



హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో



కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు... మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనిక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫోర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బులగానిన్, డీఓపి: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాదృచ్ఛికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/461Zp1y లో చదవండి.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.





'పట్టు'కోల్పోతోంది

నాడు కళకళ - నేడు వెలవెల ● అధికారుల పర్యవేక్షణ లోపం

ఐదెకరాల భూమి నిరుపయోగం ● పట్టు పరిశ్రమల కేంద్రానికి పూర్వవైభవం ఏదీ



పాడుబడిన భవనాలు



పొలానికి వెళ్లేందుకు రైతులు ఏర్పాటు చేసుకున్న మరోదారి - ప్రధాన గేటుకు ముళ్లకంపతో మూత

ఓబులవారిపల్లె, ఏప్రిల్9: నాడు కళకళలాడిన పట్టు పరిశ్రమల కేంద్రం నేడు వెలవెల పోతూ పట్టుకోల్పోతోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో కడప-చెన్నై నేషనల్ హైవేను ఆనుకుని ఉన్న ఐదెకరాల భూమి నిరుపయోగంగా మారిందని చెప్పవచ్చు. ఇందులో గతంలో ఏర్పాటు చేసిన ముళ్లకంచె, దానికి ఒక గేటు ఉన్నది. ఇది పక్కా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సంబంధించిన పట్టు పరిశ్రమల శాఖది. 1985 జనవరి 6న జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ చాకీ పట్టుపురుగుల పెంపకం ద్వారా పట్టు పరిశ్రమ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 40ఏళ్ల కిందటే అటు ఉద్యోగులు, ఇటు రైతులు ఆదాయం పొందేందుకు ముందు చూపుతో ఏర్పాటు చేసిన కేంద్రానికి అప్పటి ఐఎఫ్ఎస్ అధికారి అయిన ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్‌డీరెడ్డి, కలెక్టర్ భట్టాచార్య పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ముక్కవారిపల్లె వద్ద సుమారు ఐదెకరాల భూమిని కేటాయించారు. ఈవిషయం ప్రస్తుతం శిధిలమై ఉన్న నాటి భవనాలకు ఏర్పాటు చేసిన శిలాఫలకం ఆధారంగా తెలుస్తోంది.

చాకీపట్టు పురుగుల పెంపకం కేంద్రం

మల్బరీ పట్టుపురుగుల జీవిత చక్రంలో ఐదు దశలు ఉంటాయి. గుడ్డు నుంచి పట్టుపురుగులు బయటకు వచ్చిన రెండు దశలను చాకి పురుగులు (చాకి దశ) అటారు. మూడో దశను మధ్యస్తం అని, 4, 5 దశలను పెద్ద పట్టు పురుగులు అంటారు. గుడ్డు దశ నుంచి రైతుకు ఉపయోగపడే దశ సుమారు 8 రోజుల పాటు సరైన చర్యలు చేపట్టి రైతులకు అందించే పురుగుల పెంపకం దశను చాకి పట్టుపురుగు కేంద్రం ద్వారా చేపడతారు. ఈ దశల్లో పెరిగే పురుగులకు సరైన వాతావరణం కల్పిస్తూ పౌషకాలతో కూడిన ఆహారం అందించాలి. అనంతరం పురుగు పెరిగే దశ నుంచి గూళ్లు కట్టే వరకు రైతులు చూసుకుంటారు. ఈ ప్రక్రియను సుశిక్షితులు, అనుభవజ్ఞులైన వారి ద్వారా పెంపకాన్ని చేపట్టాల్సి ఉంటుంది. పురుగుల పెంపకం దశలో వచ్చే లోటుపాట్లను రైతులకు చెప్పడానికి తగిన సిబ్బంది అందుబాటులో ఉండేవారు. చాకీ పురుగుల పెంపకానికి కావాల్సిన వాతావరణం కల్పించేందుకు అనువైన గదులను పొందు పరుస్తూ రెండు బిల్డింగులను ఏర్పాటు చేశారు. రైతులకు శిక్షణ కేంద్రం, చాకీ పురుగుల పెంపకం కేంద్రంగా బిల్డింగ్‌లుగా ఉన్నవి. ప్రస్తుతం అవి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. సిబ్బంది బిల్డింగ్ మాత్రం వాడుకలో ఉంది. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారు. వారిది టెక్నికల్ ఆఫీసర్ కేడర్. వారు చేసే పని మొక్కలు పెంపకం, పరిరక్షణ. దానికి పేరు మోడలింగ్ ప్లాంటేషన్. ఐదెకరాల్లో ఆ కేంద్రంలో అర ఎకరాలో మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు. ఈ కేంద్రం మండల కేంద్రానికి నడిబొడ్డునే, నేషనల్ హైవే ఆనుకుని జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, అటువైపు చూస్తూ వెళుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కొండలు, గుట్టలు, కాల్వలు, వంకలు, చెరువులు సైతం కబ్జాలు చేస్తున్న ఈ కాలంలో అన్ని సౌకర్యాలు ఉన్న ఈ చాకీ పట్టుపురుగుల పెంపకం కేంద్రానికి మోక్షం రాలేదు. ఈ కేంద్రానికి ఎదురుగా ఉన్న చెరువును సైతం అక్రమ మార్గంలో పొందేందుకు సిద్ధం చేసి ఉన్నారు. దీన్ని పట్టించుకోకపోతే భూకబ్జాదారులకు భోజ్యం అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రానికి నీటి వనరుల కొరత ఉందని చెబుతున్నారు. గతంలో బోరు నీరు బాగా ఉండేదని, ప్రస్తుతం ఒక బోరులో తక్కువ నీరు వస్తున్నా దాన్ని పారిస్తూ మొక్కలు పెంచుతున్నారు. నాడు డ్రిప్ వ్యవస్థ ద్వారా మొక్కలు పెంచి పెద్ద పురుగులు పెంచే రైతులకు అవసరం ఉన్న వారికి ఆకును అందించేవారు. ప్రస్తుతం శిధిలావస్థకు చేరుకుంది. రైతులకు షెడ్లు, పురుగులు అందించి పట్టు పరిశ్రమల ద్వారా రైతులకు ఆదాయం వచ్చేలా సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ప్రక్రియ పూర్తి కాగానే అనంతపురం, కదిరి, కడపకు వెళ్లి అమ్మకాలు చేసుకునేలా అప్పటి అధికారులు తెలిపేవారని రైతులు చెబుతున్నారు. ఏదిఏమైనా ఈ శాఖ అధికారులు ఓబులవారిపల్లె మండలంలో ఉన్న ఈ చాకీ పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని ఆశావాహులు అయిన రైతులు మొక్కల పెంపకం చేపట్టి షెడ్లు నిర్మాణం చేపట్టిన రైతులకు మేలు జరుగుతుందని చెబుతున్నారు. పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గణనీయమైన ఉత్పత్తి సాధించి మంచి ఆదాయం పొందేదని, ఇన్నిరకాల వసతులున్న ఇలాంటి కేంద్రానికి కలెక్టర్, అధికారులు చర్యలు చేపడితే రైతులకు, యువతకు ఉపాధి కల్పించినవారు అవుతారు.

కేంద్రాన్ని బాగు చేస్తే అందరికీ మేలు

గతంలో ఇక్కడ చిన్న పురుగులు పెంచి రైతులకు తక్కువ రేటుకు ఇచ్చేవారు. అలాగే సూచనలు, సలహాలు ఇచ్చేవారు. అప్పట్లోనే ఈ పట్టుపురుగులు పెంచి గూళ్లు అమ్మి మంచి ఆదాయం తీసుకుంటూ ఉండేవాళ్లం. అన్ని వసతులు ఉన్న ఈ కేంద్రాన్ని బాగు చేస్తే అందరికీ మేలు జరుగుతుంది.

పోకూరు జయన్న, చిన్నఓరంపాడు

అడిగిన ప్రతి ఒక్కరికీ సలహాలు ఇస్తాం

అప్పట్లో ఈ కేంద్రం బాగా నడిచేది. ఇక్కడ ప్రస్తుతం నీరు సరిపడా లేదు. దీన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. ఆక్రమణకు గురికాకుండా మేము ఉన్నంత వరకు చూస్తాము. మోడలింగ్ ప్లాంటేషన్ చేస్తున్నాం. అడిగిన వారికి సలహాలు ఇస్తాము.

నరసింహులు, టెక్నికల్ ఆఫీసరు

సలహాలు ఇచ్చేవారు లేక మానుకున్నాం

పట్టు పరిశ్రమ అధికారుల సలహాలతో సాగు చేయడం వలన మంచి ఆదాయం వచ్చేది. ప్రభుత్వం సబ్సిడీతో షెడ్లు నిర్మాణం చేసుకోవాలని చెప్పడంతో మా పొలంలో ఏర్పాటు చేసుకున్నాం. కొంత కాలం దిగుబడి పొంది ఆదాయం పొందాం. సరైన సలహాలు ఇచ్చేవారు లేక మానుకున్నాం.

దాసరి కేశవులు, ఓబులవారిపల్లె

రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి వెండి పల్లెం బహూకరణ



చౌడేశ్వరి అమ్మవారికి వెండి పల్లెం అందిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 9: స్థానిక మేదరవీధికి చెందిన రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి రెండు కిలోల వెండిపల్లెంను శ్రీమండలపాల వెంకట రాఘవేంద్ర, సుష్మ, మాలెపాటి రవితేజ సుధామాధురి దంపతులు ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టి నాగశయనానికి అందజేశారు. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా 1.60 లక్షలు విలువైన వెండిని అమ్మవారికి ఆభరణాల తయారీ నిమిత్తం అందజేశారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు గిద్దలూరు ఈశ్వరయ్య, మచ్చ వెంకట సుబ్బరాయుడు, పోసా శివప్రసాద్, కాటం రామకృష్ణ, కాటం బ్రహ్మయ్య, ఉట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నీటిలో మునిగి వ్యక్తి మృతి



కర్రా డేవిడ్ మృతదేహం

వల్లూరు, ఏప్రిల్ 9: ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నీటిలో పడి వ్యక్తి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్ర ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు కడప రామాంజనేయపురం వాసి కర్రా డేవిడ్ (31) డ్యాం వద్దకు వచ్చి నీటిలో ఈదులాడుతుండగా ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి ప్రాణాలు వదిలాడని తెలిపారు. ఇతను చెన్నై నివాసి అయితే ఎనిమిది నెలల కిందట వల్లూరులో ప్రేమ వివాహం చేసుకుని కడపలో నివసిస్తూ ఎలక్ట్రికల్ పనులకు వెళ్లేవాడు. భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధ మహిళ మృతి

కొండాపురం, ఏప్రిల్ 9: ఏటూరు వాసి రామసుబ్బమ్మ(80) మంగళవారం అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. రామసుబ్బమ్మకు ఆరోగ్యం సరిగాలేదని ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆమె విషద్రావణం తాగినట్లు వైద్యులు తెలిపినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. చికిత్స పొందుతూ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. ఈమెకు నలుగురు కుమారులున్నా ఒంటరిగా ఉంటోంది. ఈమె ఇంట్లో ఎలుకలమందు డబ్బా ఖాళీగా పడి ఉండడంతో ఈ ద్రావణం తాగి ఉంటుందని అనుమానిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేడుకగా పెద్దపీరయ్య ఆరాధన మహోత్సవాలు

భక్తులతో కిటకిటలాడిన సిద్దయ్యగారిమఠం ● కాలజ్ఞాని శిఖాఉంగరం, బెత్తంకర్ర దర్శన భాగ్యం



ప్రత్యేక అలంకరణలో పెద్దపీరయ్యస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 9: వీరబ్రహ్మంగారి ప్రియశిష్యుడు సిద్దయ్యస్వామి కుమారుడు పెద్దపీరయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారం మఠాధిపతి రామక్రిష్ణస్వామి పర్యవేక్షణలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు అనంతరం మధ్యాహ్నం 4గంటలకు పెద్దపీరయ్య స్వామికి, సిద్దయ్యస్వామికి వస్త్రాలంకరణ, ప్రత్యేక అలంకరణను చేపట్టారు. ఉగాది పర్వదినం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దపీరయ్యస్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మంగారి సజీవ సమాధి వహించిన అనంతరం సిద్దయ్యస్వామికి శిఖ ఉంగరం, పావుకోళ్లు, బెత్తంకర్ర పూజా సామగ్రి అందించారు. వాటిని తన కుమారులైన పెద్దపీరయ్యస్వామికి అందించారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా భక్తులకు స్వామి వారి పూజా సామగ్రి దర్శనభాగ్యం కల్పించారు. భక్తులందరూ స్వామి వారి పూజా సామగ్రిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణలో భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తూ చలువ పందిర్లు వేయించారు. అంతేకాకుండా తాగునీరు, మజ్జిగ, భోజన వసతి మఠాధిపతి రావక్రిష్ణస్వామి చేపట్టారు.

గ్రామోత్సవానికి రథం వితరణ

సిద్దయ్యగారిమఠంలో జరుగుతున్న పెద్దపీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గ్రామోత్సవానికి కనుపర్తి రామసుబ్బారెడ్డి రూ.10లక్షలు విలువైన రథాన్ని ఆలయ మఠాధిపతులకు అప్పజెప్పారు. ఈ ఏడాది అవకాశం రావడంతో రథాన్ని చేయించినట్లు రామసుబ్బారెడ్డి తెలిపారు.

అన్నసత్రాల్లో భక్తులకు అన్నదానం

భక్తులకు శ్రీ వాసవీ సిద్దగురుస్వామి ఆర్యవైశ్య అన్నసత్రం బద్వేలు కమిటీ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ గోవిందయ్యశ్రేష్ఠి, గౌరవాధ్యక్షుడు నగళా వెంకటసుబ్బ రాయుడు శ్రేష్ఠి, వైస్ ప్రెసిడెంట్ బింగి సుధాకర్‌శ్రేష్ఠి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శ్రీవాసవీ ఆర్యవైశ్య అన్నదాన సత్రం సిద్దయ్యగారిమఠం ముడుమాల కమిటీ అన్నదానం చేపట్టారు. సిద్దయ్యస్వామి అన్నదాన సత్రంలో అన్నదానాన్ని ప్రెసిడెంట్ సిద్దేశ్వరయ్య, వైస్ ప్రెసిడెంట్ సిద్దయ్య, కార్యదర్శి నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. రాత్రికి భక్తులకు భజన కార్యక్రమాలు, చింతామణి నాటకం నిర్వహించారు.



రథంతో దాత రామసుబ్బారెడ్డి

ప్రజలందరికీ మంచి జరగాలి

ఉగాది సంబరాల్లో జిల్లా జడ్జి శ్రీదేవి



ఏఓను సన్మానిస్తున్న

కడప(రూరల్) ఏప్రిల్ 9: శ్రీక్రోధినామ సంవత్సరాది సందర్భంగా ప్రజలందరికీ మంచి జరగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, రామారావు దంపతులు పేర్కొన్నారు. మంగళవారం జడ్జి బంగ్లాలో తెలుగు నూతన సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలన్నారు. న్యాయశాఖలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి ఉగాది పచ్చడి ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి, రామారావు దంపతులు జిల్లా న్యాయశాఖ పరిధిలో సేవలందిస్తున్న ఉద్యోగులు, సిబ్బందిని సత్కరించి ఉగాది పురస్కారాలను అందించారు. తరువాత సాయిశివశంకర్ సుందరకాండను ఆలపించారు. కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పుట్టా' కే నా మద్దతు

● రాజకీయాలకు రఘురామిరెడ్డి పనికిరాడు : డీఎల్



ఖాజీపేట, ఏప్రిల్ 9: నాతోపాటు 40 ఏళ్ల రాజకీయం చేసినవారికి ఒక్కటే సూచన. రఘురామిరెడ్డి రాజకీయాలకు పనికిరాడని సర్వేలు తేల్చాయని, అందువలన పుట్టా సుధాకర్‌యాదవ్‌కు నా మద్దతు ఉంటుందని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి ప్రకటించారు. మంగళవారం డీఎల్ తన స్వగృహంలో మాట్లాడుతూ పుట్టా సుధాకర్ మంచి వ్యక్తి కాబట్టి ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తే ప్రజలు ఎప్పటికీ మరచిపోరన్నారు. చంద్రబాబు ఒక పద్ధతిగల రాజకీయ నాయకుడని, ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్నారు. చంద్రబాబు ఎంతో మేధావి అని, జనసేన, బీజేపీతో పొత్తు ఎందుకు పెట్టుకున్నాడో తెలియదు కానీ ఒక్కరే బరిలో దిగినా కూడా ప్రభుత్వం ఏర్పాటయ్యేదన్నారు. నాతో ఎవరూ మాట్లాడలేదని, రాజకీయాల్లో సుధాకర్ యాదవ్ మేలు కాబట్టి నామద్దతు తెలుపుతున్నానని, నా శ్రేయోభిలాషులకు నేను అండగా ఉంటానన్నారు. ప్రతిపల్లె తిరిగి సమస్యలు డైరీలో రాసుకుని వాటిని పరిష్కరించినప్పుడే ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. వ్యక్తిగతంగా ఎజెండా లేదని, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం వస్తుందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు సూపర్-6 పథకాలను అమలు చేసి ప్రజలకు మేలు చేస్తారన్నారు. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే ఎన్డీయే ప్రభుత్వం రావాలని, నేను గ్రామాలకు వెళ్లి ప్రచారం చేయలేను, నా దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ సుధాకర్‌యాదవ్‌కు ఓటు వేయాలని చెబుతానన్నారు.

● వివేకం సినిమా చూడాలి

ఎంపీకి ఓటు వేయాలంటే వివేకం సినిమా చూసి మీకు నచ్చిన వారికి ఓటు వేయాలన్నారు. కోర్టుపరిధిలో ఉంది కాబట్టి నేను చెప్పనని, ప్రతి ఒక్కరూ వివేకం సినిమా చూడాలన్నారు. సునీతమ్మ కూడా నాతో మాట్లాడారని, నేను వైసీపీకి మద్దతు ఇవ్వడంలేదని చెప్పానన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆధునికీకరణ సరే.. ఆక్రమణలూ...?

● నేటికీ ఆక్రమణలో నాగులచెరువు

● ఆధునికీకరణకు కోటీ 40 లక్షల ఖర్చు

● పాలకపక్ష, అధికారుల వైఫల్యం



బద్వేలు రూరల్, ఏప్రిల్ 9: సకాలంలో వర్షాలు కురవడంతో నీరు సమృద్ధిగా ఉన్నప్పుడు సాగునీరు పారి పంటలు పండి, ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా ఉండేవి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సైతం నేడు చెరువులు, కుంటలు, వంకపోరంబోకు స్థలాలు ఆక్రమణలకు గురవుతుంటే పట్టించుకునే నాధుడే కరవయ్యాడు. ఆ కోవలో స్థానిక నెల్లూరు రోడ్డులో ఉన్న నాగులచెరువు దాదాపు 30 ఎకరాలు ఆక్రమణకు గురైతే ఆక్రమణలు తొలగించడంలో జాప్యం చేస్తున్న పాలకపక్ష, అధికారులు నాగులచెరువు సుందరీకరణకు దాదాపు కోటీ 40 లక్షలు ఖర్చు పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆయకట్టు రైతాంగం ప్రశ్నిస్తోంది.

నాగులచెరువు విస్తీర్ణం

నాగుల చెరవు దాదాపు 184 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో చెరువులో నీరు సమృద్ధిగా ఉండి ఆయకట్టుకు నీరు పారుతుండేది. చెరువు తూర్పు భాగాన పూర్తిగా ఆక్రమణకు గురవడంతో ఓ వైపు చెరువులో మాత్రమే నీరు నిలుస్తోంది. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు పారిందే లేదు. నాగుల చెరువుకు 588 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. చెరువు కట్ట అంజనేయస్వామి గుడి వద్ద నుంచి చుట్టుపక్కల భూములన్నీ ఈ చెరువు నీటితోనే పంటలు పండిస్తుండేవారు. అయితే నిన్నటి వరకూ చెరువులో ముళ్లపొదలు పెరిగి కొంత మేర ఆక్రమణకు గురై ఆయకట్టు భూములకు సాగునీరందిందే లేదు. ఆక్రమణకు గురైనా చెరువులో ముళ్లపొదలు పెరిగినా సంబంధిత శాఖ అధికారులు ఇంత వరకు పట్టించుకున్న పాపాన పోలేదు.

సుందరీకరణకు రూ. కోటీ 40 లక్షలు

నాగులచెరవు 30 ఎకరాల పైబడి ఆక్రమణకు గురైతే పట్టించుకోని పాలక పక్షం సుందరీకరణకు మాత్రం రూ.కోటీ 40 లక్షలు మంజూరు చేయించుకుని సుందరీకరణ పనులు పూర్తి చేస్తున్నారు. మరో రెండు కోట్లు కూడా సుందరీకరణకే నిధులు మంజూరైనట్లు సమాచారం. దీంతో దాదాపు రూ.3 కోట్ల 40 లక్షల రూపాయలు సుందరీకరణకు నిధులు తెచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆక్రమణలు తొలగించడంలో జాప్యం వహిస్తోంది. చెరువు ఆక్రమణలు తొలగించి ఆయకట్టు భూములకు సాగునీరందించేందుకు చేయవలసిన పనులను పూర్తి చేస్తే ఆయకట్టు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయన్న విషయాన్ని పూర్తిగా మరిచారు.

చెరువుల ఆక్రమణలు

పట్టణ పరిధిలో ఉన్న నాగుల చెరువు, భాకరాపేట చెరువు, చెన్నంపల్లె చెరువులకు సంబంధించిన స్థలాలను కొందరు ఆక్రమించుకుని కట్టడాలను నిర్మిస్తుంటే సంబంధిత శాఖ అధికారులు ఆక్రమణలు తొలగించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. ఎకరాలకు ఎకరాలు చెరువు స్థలాలు ఆక్రమణకు గురైతే భవిష్యత్తు తరాలకు చెరువులన్న మాటే తెలియకుండా పోతోందని తద్వారా రైతాంగం కూడా ప్రకృతి సహజ సిద్ధమైన చెరువునీటిని ఉపయోగించుకోవడం మానుకుని బోరుమోటార్లపై ఆధారపడి వ్యవసాయాన్ని సాగు చేయవలసి వస్తోందని రైతాంగం ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు కానీ, అధికార వైసీపీ ప్రభుత్వం కానీ చెరువు ఆక్రమణలు తొలగించాలని వారు కోరుతున్నారు.

రైలు కింద పడి మెడికల్ విద్యార్థికి గాయాలు

కడప (క్రైం) ఏప్రిల్ 9: కడప రైల్వే స్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫారం వద్ద మంగళవారం మెడికల్ విద్యార్థిని రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద పడి కాలు తెగిపోయింది. కడప వాసి అధిరా గుల్బర్గాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతోంది. గుల్‌బర్గాకు వెళ్లేందుకు రైలు బయలు దేరుతుండగా ఆమె ఎక్కబోతూ ప్రమాద వశాత్తు కింద పడిపోవడంతో ఎడమకాలు తెగిపోయింది. ప్రయాణికులు చైను లాగి రైలును నిలిపి ఆమెను ఆస్పత్రికి తరలించారు.

రూ.7లక్షలు స్వాధీనం



వివరాలు తెలుపుతున్న సీఐ

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 9: స్థానిక టూ టౌన్ సీఐ అబ్దుల్ కరీం సిబ్బందితో కలిసి రూ.7లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. స్థానిక వాసవీ సర్కిల్ దగ్గర ఆర్టీసి బస్సులో ముద్దనూరు వాసి భూమిరెడ్డి వెంకట శివారెడ్డిని తనిఖీ చేయగా అతని వద్ద రూ.7లక్షలు ఉండడం, బిల్లులు చూపనందున నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు.

మంగంపేట గంగమ్మ సన్నిధిలో జనసేన అభ్యర్థి



మంగంపేట గంగమ్మను దర్శించుకున్న అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా మంగంపేట బలిజపల్లెలో వెలసిన గంగమ్మను జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి తాతంశెట్టి నాగేంద్ర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో రైల్వే కోడూరులో వైసీపీని ఓడించి ఎన్‌డీఏ అభ్యర్థిని అఖండ మెజారిటీతో గెలిపిస్తామని తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగంపేట జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయంలో 'కస్తూరి' పూజలు



పూజలు నిర్వహిస్తున్న కస్తూరి

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం టీడీపీ సీనియర్ నేత కస్తూరి విశ్వనాథ నాయుడు పూజలు చేశారు. కోడూరు నియోజకవర్గ ప్రజలు నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు ముఖ్యమంత్రి కావలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభం

రామాపురం, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాది ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు సీతారాముల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలోని సీతారామ లక్ష్మణ హనుమంత ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాలు మంగళవారం ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ప్రతి రోజు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు దేవాలయంలో విశేష పూజలు, భక్తిగీతాలాపనలు, భజనలు, నవమి రోజున సీతారాముల కల్యాణం, రాత్రికి బ్రహ్మోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గరికతో గణపతికి అలంకరణ



ప్రత్యేక అలంకరణలో గణపతి

నందలూరు, ఏప్రిల్ 9 : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే ఉన్నవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని గణపతి ని గరికతో అలంకరించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌శర్మ పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పూజలలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వానికి రమేశ్‌కుమార్‌రెడ్డి రాజీనామా

రాయచోటిటౌన్, ఏప్రిల్ 9: తెలుగుదేశం పార్టీ విధానాలు నచ్చకపోవడంతోనే ఆ పార్టీ సభ్యత్వానికి, నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసి పార్టీ నుంచి బయటికి వస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రమేశ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక బోస్‌నగర్ లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బుధవారం ఉదయం 8 గంటలను వినుకొండ దగ్గర జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వైసీపీ సభ్యత్వం తీసుకుంటున్నానని చెప్పారు.

హామీలు తప్ప.. ఆచరణ శూన్యం

● కళాశాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపు ● పై చదువులకు దూరమవుతున్న పేద విద్యార్థులు

చిట్వేలి, ఏప్రిల్ 9: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుపై విద్యార్థుల తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా కళాశాల ఇదిగో వచ్చేస్తుంది.. అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామంటూ నాయకుల ఆర్భాటాలు చేయడం తప్ప, ఆచరణ ఏదీ అనిప్రశ్నిస్తున్నారు. జిల్లాలో మారుమూల మండలమైన చిట్వేలి పరిధిలో 21 పంచాయతీలు ఉన్నా, ఎలాంటి సౌకర్యాలు లేవని చెప్పవచ్చు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూరిబా పాఠశాల, నాలుగు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రతి ఏటా వందల మంది విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత పొందుతున్నారు. చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలోనే 1490 విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో వారంతా ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లలేక, ప్రైవేటు కళాశాలలో ఫీజులు చెల్లించలేక అర్థాంతరంగా చదువులు నిలిపివేస్తున్నారు. కొన్ని నెలల క్రిందట ఉన్నత పాఠశాల ఆవరణంలోని హాస్టల్ భవనంలో జూనియర్ కళాశాల ఏర్పాటు సాధ్యాసాధ్యాలను నాయకులు పరిశీలించడంతో తల్లిదండ్రులో ఆశలు రేకెత్తినా.. అదేదీ ఆచరణకు నోచుకోకపోవడంతో వారి ఆశలు ఆవిరైపోయాయి.

కోడూరు, రాజంపేట వెళ్లాల్సిందేనా..

ఏడాది మండలంలో 692 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. వీరు పాస్ అయ్యాక పరిస్థితి ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఉంటే వీరందరూ ఇక్కడే చదువుకునే వారనిని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతున్నారు.



కాలేజీ కోసం పరిశీలించిన పాఠశాల భవనం

జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి



మండల స్థాయిలో జూనియర్ కళాశాల ఉండాలి. ఆడపిల్లలను దూర ప్రాంతాలకు పంపించడం, ఆర్థిక స్తోమత లేని వారు తమ పిల్లలను పట్టణాల్లో ఇంటర్‌చదివించడం కష్టమవుతోంది. దీంతో చాలామంది మధ్యలోనే చదువును మానేస్తున్నారు. దీనిపై నాయకులు, అధికార యంత్రాంగం ఆలోచించాలి.

200 ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరిక

చిన్నమండెం, ఏప్రిల్ 9: మండలంలోని 200 మైనార్టీ కుటుంబాలు మంగళవారం ఎంపీటీసీ మాజీ సభ్యుడు అలీబాషా ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కండువాలు కప్పి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరితోనూ తనకు వ్యక్తిగత విబేధాలు లేవు. నిత్యం కార్యకర్తలకు, నా అభిమానులకు అండగా ఉన్నా, శ్వాస ఉన్నంతవరకు ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంగళ వారం ఉదయం చిన్నమండెం కస్బాలో షేక్. అలీబాషా ఇంటి దగ్గర ఏర్పాటు చేసిన తెలుగుదేశం బీసీల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు మరింత మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీల రిజర్వేషన్‌ను తగ్గించి వారి రాజకీయ ఎదుగుదలకు వైసీపీ అడ్డుపడిందన్నారు. చిన్న మండెం మండలంలో వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న బీసీ కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయని, పార్టీ అధికారంలోకి రాగానే సాగు, తాగునీరు అందిస్తామన్నారు. చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే వ్యక్తిని కాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ నాయకులు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సర్వాణి రహంతుల్లాఖాన్‌కు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ఘనంగా తెలుగు సంవత్సరాది వేడుకలు



రాయచోటి: రెడ్డీస్‌కాలనీ రామాలయంలో హోమాలు నిర్వహిస్తున్న భక్తులు



కొత్తపేట రామాలయంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఆపస్ సభ్యులు



రైల్వేకోడూరు: పురవీధుల్లో ఊరేగుతున్న కోదండ రామస్వామి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 9: ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం రాయచోటి పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భద్ర కాళీ సమేత వీరభద్రాలయంలో ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, ఈవో డీవీ రమణారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు పంచాంగ పఠనం చేశారు. పాత రాయచోటిలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రెడ్డీస్‌కాలనీలోని రామాంజనేయస్వామి దేవాలయంలో మధుసూదన్‌రాజు దంపతులు ఉదయం స్వామి వారికి అభిషేకాలు, హోమాలు నిర్వహించగా సాయంత్రం పీరయ్య దంపతులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం శ్రీరామనవమి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో కొత్తపేటలోని కోదండ రామాలయంలో ఉగాది పచ్చడి వితరణ చేశారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు తమ స్వగ్రామాలకు వెళ్లి తమ పూర్వీకుల సమాధుల వద్ద కొత్త బట్టలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టారు.

గాలివీడు: తెలుగువారికి మొదటి పండుగ అయిన ఉగాదిని మండల ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ఉదయమే ఇంటిల్లిపాది స్నానాలు చేసి, గుడికి వెళ్లి పూజలు చేశారు. ప్రతి ఇంటికి మామిడి తోరణాలతో అలంకరించారు. ఉగాది పచ్చడిని ప్రతి ఒక్కరూ పంచుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల వద్ద పంచాంగం విన్నారు. సాయంత్రం పెద్దల సమాధుల వద్ద బట్టలు పెట్టి వారి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

రైల్వేకోడూరు(రూరల్): ఉగాది సందర్భంగా రైల్వే కోడూరులో కోదండ రామస్వామిని ఊరేగించారు. అనంతరం భక్తులు భజనలు భక్తి పాటలు ఆలపించారు.

రాజంపేట టౌన్ : ఉగాది సందర్భంగా తాళ్లపాక లో మంగళవారం రాత్రి చెన్న కేశవ, సిద్దేశ్వర స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. అన్నమయ్య ఇలవేల్పు దైవాలైన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ, సిద్దేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను తాళ్లపాక పురవీధుల్లో ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి వార్లకు పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక సర్పంచ్ గౌరీ శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తదితరు లు పాల్గొన్నారు.



గాలివీడులోని రామాలయంలో పంచాగ పఠనం చేస్తున్న వేదపండితులు

నేటి నుంచి మంచాలమ్మ జాతర

రామాపురం, ఏప్రిల్ 9: మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరు క్వాటర్స్ సమీపంలో బుధ, గురువారాల్లో మంచాలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం అమ్మవారిని ఆలయంలోనికి తీసుకువస్తారు. మొక్కుబడి ఉన్న వారు, సంతానం కావాల్సిన వారు ఆలయం వద్ద వరపడుతారు.అనంతరం పూజలు చేస్తారు. మొక్కుబడులు ఉన్న వారు బుధవారం రాత్రి చాందినీ బండ్లు ఆలయంచుట్టూ తిప్పుతారు. ఈ సందర్భంగా చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ జాతరకు మండలంలోనే కాకుండా అన్నమయ్య జిల్లా, కడప జిల్లాల నుంచి ప్రజలు అధిక సంఖ్యంలో మహిళా భక్తులు పాల్గొంటారు.

నందలూరు: మండలంలోని ఆడపూరు గ్రామంలో మంగళవారం మంచాలమ్మ తిరుణాల నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించారు. ఈ ఉత్సవానికి కర్ణాటక నుంచి భక్తులు హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడపూరు పంచా యతీలోని పలు గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.





రామాపురం, నందలూరుల్లో ప్రత్యేక అలంకరణలో మంచాలమ్మ

మానవత శాంతి రథానికి రూ.50 వేలు విరాళం

చిట్వేలి, ఏప్రిల్9 : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖలో శాంతిరథం ఏర్పాటుకు మండల పరిధిలోని నక్కలపల్లెకు చెందిన కట్ట నాగేశ్వరరావు 50వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత చేస్తున్న విశిష్ట సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయం అందించాలన్న దృక్పథంతో ఈ చర్యలు తీసుకున్నాన్నారు. ఈ కార్యక్రమంలో మానవత కార్యదర్శి మునిరావు, సభ్యులుశ్రీసాయి వికాస్ కరస్పాండెంటు తిరుమల రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు రూ.10 వేలు ప్రకటన హర్షణీయం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 9: ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న వలంటీర్ల వేతనం నెలకు రూ.10 వేలకు పెంచుతామని ను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షణీయమని రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ కార్యదర్శి కూనాసి సుబ్బరాజు యాదవ్, నూరు ఎకరాల రంగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నాగిరెడ్డిలు అన్నారు. మంగళవారం రాయచోటిలో మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లను తొలగిస్తారని వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడుతూ తాము అధికారంలోకి వస్తే రూ.5 వేల జీతాన్ని, రూ.10 వేలకు పెంచుతామని ప్రకటించడంతో వలంటీర్లలో ఆనందోత్సాహాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్రజలకు సేవ చేసే వలంటీర్లకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని చంద్రబాబు చెప్పడం ఆయన గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఈ ప్రకటనతో వలంటీర్లలో కొత్త ఆశలు చిగురించాయన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజున ఈ ప్రకటన రావడంతో వలంటీర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికులకు, కర్షకులకు, ఉద్యోగులకు అండగా ఉంటుందని, వైసీపీ ప్రభుత్వం లాగా దోచుకో దాచుకో అనే విధంగా అనీతి, అక్రమాలు అరాచకాలు, దౌర్జన్యాలు టీడీపీలో ఉండవన్నారు.



రాయచోటిలో మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

టీడీపీతోనే యువతకు ఉద్యోగ అవకాశాలు



టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న యువత

రాజంపేట, ఏప్రిల్ 9 : తెలుగుదేశం పార్టీతో యువతకు చక్కటి అవకాశాలు లభిస్తాయని టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో 11వ వార్డు యువత ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పరిశ్రమలు రావాలన్నా రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కావున యువత టీడీపీ విజయానికి తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు చదరల ప్రేమ్‌కుమార్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, చదర్ల వినోద్‌కుమార్, శ్రీహర్ష, తిరుపాల్, ఆదిత్య, చైతన్య, హరి, వెంకటరమణ, అరుణ్, హరిప్రసాద్, చిరుదీప్, సమీర్, మహమ్మద్, కిరణ్, సుహేల్, రఘు, వినోద్, రెడ్డి, చందు, శంకర్, మణి, సురేంద్ర, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పైనే రాష్ట్ర భవిష్యత్తు : ముక్కా

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 9: రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే ఉమ్మడి కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపా నందరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కుక్కలదొడ్డి పంచాయతీలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, టీడీపీ బీజేపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సార్లు గెలిచిన వైసీపీ అభ్యర్థి కోడూరు అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. ఒకసారి అవకాశం ఇచ్చి ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తే కోడూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో సుపరిపాలన రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి, ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, ఉత్తరాది శివకుమార్, ముత్యాల కిషోర్, మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త టీడీపీ నాయకులు మాచినేని విశ్వేశ్వర నాయుడు, వెంకటేశ్వరరాజు, కట్టా గుండయ్య నాయుడు, బీసీ నాయకలు ఎస్‌వి గోపాల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న నాయకులు

ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం జరగాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 9: ఈ ఏడాది ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామని ఆపస్ జిల్లా మీడియా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉగాది సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి భక్తులందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు న్యాయం జరగాలని, 11వ పీఆర్సీ తొందరగా అమలు కావాలని కోరుకుంటున్నామన్నారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలు, మెగా డీఎస్సీపై నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గడియాల వెంకటసూర్యప్రసాద్, పురోహితుడు శ్రీహరిస్వామి, గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు రాజాసేవ కరీంనగర్ మల్లయ్య, ఉపాధ్యక్షుడు శ్రీసాయి చరణ్‌యాదవ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



ఉగాది పచ్చడి అందజేస్తున్న ఆపస్ నేతలు

కోదండరామాలయంలో పంచాంగ పఠనం

ఒంటిమిట్ట, ఏప్రిల్9 : ఉగాది సందర్భంగా ఒంటిమిట్ట కోదండరామాలయంలో టీటీడీ అర్చకులు, రామాలయ ఆస్థాన పురోహితుల ఆధ్వర్యంలో పంచాంగ పఠనం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రంగ మండపంలో పంచాంగ పఠనం ప్రారంభించారు. ఈ సంవత్సరం రైతులకు, పాడి పరిశ్రమలకు శుభదాయకంగా ఉంటుందని, పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయన్నారు. ప్రకృతిలో సంభవించే విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అర్చకులు శ్రావణ్‌కుమార్, వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, గ్రామ పురోహితులు ఏలేశ్వరం గురుస్వామి పాల్గొన్నారు.

బీసీ నేత మల్లెలతో బీజేపీ నేతల భేటీ

రాజంపేట, ఏప్రిల్ 9 : రాజంపేట పట్టణ బీసీ నాయకుడు మల్లెల సుబ్బరాయుడుతో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బీజేపీ ఎన్నికల పరిశీలకుడు సుమన్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ కోటిరెడ్డి తదితరులు మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడును సన్మానించారు.



రాజంపేట బీసీ నేత మల్లెల సుబ్బరాయుడు నాగోతుతో రమేష్‌నాయుడు

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి



చిన్నమండెం: కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు



సిద్ధవటం: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ పెద్ద ఓబన్న

చిన్నమండెం, ఏప్రిల్ 9: ప్రతిపౌరుడు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ రమేశ్‌బాబు సూచించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంగళవారం కొత్తపల్లి పంచాయతీలోని శ్రీరామ్‌నగర్ కాలనీ, శ్రీనివాసపురం, బోరెడ్డిగారిపల్లె, కలిబండ గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. రాబోవు ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు అనునిత్యం అందుబాటులో ఉంటాయని ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ కవాతు అని ఎస్ఐ అన్నారు.

సిద్ధవటం: మండలంలోని మూలపల్లెలో మంగళవారం పల్లెదర్శిని కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్షన్ నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. 50వేల రూపాయలు మించి నగదు తీసుకెళ్లరాదని అలా తీసుకెళ్లాలంటే వాటికి తగిన పత్రాలను చూపించాలన్నారు. గ్రామాల్లో గొడవలకు అల్లర్లకు పాల్పడవద్దని ఒక వేళ ఎక్కడైనా గొడవలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించా లని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు మూలపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పంతగానితో బీజేపీ నేతల చర్చలు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 9: టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్‌తో మంగళవారం బీజేపీ నాయకులు నాగోతు రమేష్ నాయుడు, రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్ రాజు, సీనియర్ నాయకులు సుమంత్ తదితరులు కోడూరులోని పంతగాని నివాసంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి కిరణ్ కుమార్ రెడ్డి విజయం కోసం కృషి చేయాలని కోరారు. అయన విజయానికి తమ సహకారం అవసరమని వారు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో అందరిని కలుపుకుని పోతున్నా మన్నారు. నరసింహ ప్రసాద్ తమకు పూర్తిగా సహకారం ఇస్తారని ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బొక్కసం చలపతి మరియు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



పంతగానిలో చర్చిస్తున్న బీజేపీ నాయకులు

ముక్కా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 9: పట్టణంలోని జామీయా మసీదులో టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మంగళవారం ప్రార్థనల్లో పాల్గొన్నారు. జామియా మసీదుతో పాటు ఢిల్లీ, జగదంపల్లి, అమీనా, కౌసర్ , సంజీవపురం మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు ఉమ్మడి కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ ,కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


బోసిపోయిన చిత్తూరులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి

స్వల్పంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

● అత్యధికంగా శ్రీరంగరాజపురంలో 39.4 డిగ్రీల నమోదు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 9: వారంరోజులుగా నిప్పుల కొలిమిని తలపించిన ఎండలు.. చిత్తూరులో మంగళవారం కాస్త తగ్గుముఖం పట్టాయి. మండలాలవారీగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు.. శ్రీరంగరాజపురంలో 39.4, నింద్రలో 39.0, విజయపురంలో 38.9, నగరిలో 38.9, పుంగనూరులో 38.8, గుడిపాలలో 38.7, తవణంపల్లెలో 38.3, గుడుపల్లెలో 38.0, పాలసముద్రంలో 37.8, చిత్తూరులో 37.6, నదుంలో 37.6, శాంతిపురంలో 37.4, కుప్పంలో 37.1, బంగారుపాళ్యంలో 37.0, చౌడేపల్లిలో 37.0, రొంపిచెర్లలో 37.0, పులిచెర్లలో 37.0, గంగాధరనెల్లూరులో 36.6, కార్వేటినగరంలో 36.5, పెద్దపంజాణిలో 36.4, సోమలలో 36.2, వెదురుకుప్పంలో 36.2, యాదమరిలో 36.1, పలమనేరులో 36.1, పెనుమూరులో 36.1, వి.కోటలో 35.9, పూతలపట్టులో 35.7, గంగవరంలో 35.2, ఐరాలలో 35.1, బైరెడ్డిపల్లిలో 35.0, రామకుప్పంలో 34.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

క్వారీని అడ్డుకున్న గ్రామస్తులు



కుప్పం, ఏప్రిల్ 9: కుప్పం మండలం కృష్ణదాసన పల్లె పంచాయతీ రాజనం గ్రామ సమీపంలో నడుస్తున్న గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ క్వారీ పేలుళ్ల వల్ల చాలాకాలంగా ముగజీవాలు మృతి చెందుతున్నాయని వాళ్ళు ఫిర్యాదు చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వస్తే ఎప్పుడు ఏ పేలుడు వల్ల, ఏ రాయి వచ్చి మీద పడుతుందోనని క్షణక్షణం ప్రాణభయంతో బతుకుతున్నామన్నారు. ఎన్నిసార్లు క్వారీ యాజమాన్యానికి చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఇంటి గోడలు కూడా బీటలువారి ఆస్తి నష్టం కూడా సంభవిస్తున్నదాని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ కార్యకలాపాలను అధికారులు అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

వరసిద్ధుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 9: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కరోల్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

తిరుమలలో సందర్శనీయ ప్రాంతాలు కళకళ


జపాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా తిరుమలలోని సందర్శనీయ ప్రాంతాలు మంగళవారం కళకళలాడాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చిన యాత్రికులతోపాటు తిరుపతి, తిరుమల స్థానికులు పాపవినాశనం, ఆకాశగంగ, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, శ్రీవారిపాదాలు, చక్రతీర్థం, శిలాతోరణం వద్ద కిక్కిరిసి కనిపించారు. మంగళవారం కావడంతో జపాలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. గోగర్భం డ్యాం వద్దనున్న క్షేత్రపాలకుడు(రుద్రుడు), పాచికాల్వ గంగమ్మ ఆలయం, స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లోని వినాయక స్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

తిరుపతి ఎంపీ అభ్యర్థిగా చింతా మోహన్

రెండో జాబితాతో అనుమానాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం



తిరుపతి , ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి వెళ్లడంతో ఎంపీ సీటు కూడా ఇతరులకు కేటాయిస్తారేమోనన్న అనుమానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం తెరదించింది. మంగళవారం విడుదల చేసిన రెండోజాబితాలో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చింత మోహన్‌కే కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న చింతా మోహన్ రాష్ట్ర విభజన అనంతరం 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినా పార్టీనే అంటిపెట్టుకుని కాంగ్రెస్ జెండాను ఊరూ వాడా తిప్పారు. అయితే ఎంపీ సీటు తనకు వస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య ఇటీవల మీడియా ముందు ఇండియా కూటమి తరపున స్వీయ ప్రకటన చేశారు. అసెంబ్లీ సీటుతో పాటు ఎంపీ సీటు కూడా ఇండియా కూటమికి వెళ్లే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో చింతా మోహన్ పదిరోజులుగా ఢిల్లీలో మకాం వేశారు.ఎట్టకేలకు ఏఐసీసీలో తనకున్న ప్రాబల్యాన్ని మరోసారి చాటుకున్నారు. ఆయన తిరుపతి ఎంపీగా ఉప ఎన్నికలతో కలిపి పదకొండోసారి పోటీ చేయబోతున్నారు.

వైసీపీ శ్రేణులకు పండుగ బహుమతి

● ఒకటిన్నర సెంటు ఇంటి స్థలానికి ఎంజాయ్‌మెంటు పట్టా

రేణిగుంట, ఏప్రిల్ 9 : రేణిగుంట పట్టణంలో ఎంపిక చేసిన వైసీపీ కార్యకర్తలకు పండుగ బహుమతి పంపిణీ జరిగింది.ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ముఖ్య ప్రజాప్రతినిధి కుమారుడు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలో జరిగిన వైసీపీ కార్యకర్తల అత్యవసర సమావేశంలో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మధన్నను మళ్లీ గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిధిలోని ఓ ప్రభుత్వ భూమికి సర్వే నెంబరు వేసి ఆ భూమిలో ఎనిమిది సంవత్సరాలుగా కాపురం ఉ ంటున్నట్లు, తహసీల్దారుకు అర్జీ పెట్టుకుంటే ఆ విషయాన్ని గుర్తించి 2016లో ఒకటిన్నర సెంటు పట్టా ఇచ్చినట్లు చూపుతున్న పత్రాలను వైసీపీ క్యాడర్‌కు పంపిణీ చేశారు. అయితే మధన్న ఎమ్మెల్యేగా ఈసారి గెలిచిన తరువాత ఇంటి జాగాలు చూపిస్తామనడం కొసమెరుపు.దీంతో ఈ ఇంటి పట్టాలు అసలా, డూప్లికేటా అని తీసుకున్నవాళ్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


తిరుమల ఆలయం ముందు శ్రీరాముడి ప్రతిమ




తిరుమల ఆలయంలో ఫల,పుష్పాలంకరణలు - తిరుమల ఆలయంలో అద్దాల మండలపం వద్ద రామలక్ష్మణుల సెట్టింగ్

శ్రీవారి ఆలయంలో ఆకట్టుకున్న అలంకరణలు



తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో ఉగాది ఆస్థానం సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరిగింది. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా, మరోపీఠంపై విష్వక్సేనులవారినీ వేంచేపు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు.టీటీడీ ఉద్యానవన విభాగ ఫల, పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్‌ను అలంకరణకు వినియోగించారు. ప్రత్యేకించి ఆలయంలో ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, నారింజ, కర్బూజ, మామిడి వంటి విభిన్న రకాల పండ్ల గుత్తులు, ఉత్తమజాతి పుష్పాలతో భూలోక వైకుంఠంగా శ్రీవారి ఆలయాన్ని రూపొందించారు.ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పుచ్చకాయలతో చెక్కిన దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే అయోధ్య రామాలయం, బాలరాముడి సెట్టింగ్, నవధాన్యాలతో రూపొందించిన మత్స్య అవతారం భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వెలుపల గొల్లమండపం పక్కన త్రేతా, ద్వాపర, కలియుగాలకు సంబంధించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి, వేదనారాయణ స్వామి, మహావిష్ణువు దశావతరాలు, ఉద్యానవనంలో ఆడుకుంటున్న రామలక్ష్మణ సమేత హనుమంతులు, బాలకృష్ణుడు వంటి పౌరాణిక ఘట్టాలు విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవన విభాగ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వందమంది రెండురోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన ఫల, పుష్పాలంకరణ ఆకృతులను రూపొందించారు.


తిరుమల ఆలయంలో మత్స్యావతారం సెట్టింగ్

పాడి రైతులకు ప్రోత్సాహమేదీ?

గత పథకాలు తొలగించారు..కొత్త వాటి ఊసే లేదు ● గ్రాసం కొరతతో అల్లాడుతున్న పశువులు

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 9 : పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతులకు ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ అందలేదు. పశు పోషకులకు అందాల్సిన రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా దూరమయ్యాయి. పాల ఉత్పత్తి పెంపుతోపాటు పాడి రైతులకు ఆర్థిక చేయూత అందించేలా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు వైసీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. పశుగ్రాసం కొనలేక, పశువులను పోషించలేక కబేళాలకు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఆవులు 8,00,132, గేదెలు 2,74,535, గొర్రెలు 12,62,226, మేకలు 4,68,916 ఉన్నాయి. వీటి కోసం 1,432 ఆర్బీకేలు, 283 సబ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

గత ప్రభుత్వ హయాంలో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు ఏటా పశు పోషకులకు పాతర గడ్డి(సైలేజ్), దాణాతోపాటు పలు పథకాలు రాయితీపై అందించారు. ఏటా టన్నుల కొద్ది పాతర గడ్డి బేళ్లను నేరుగా గ్రామాల్లోని పశు పోషకులకు అందజేశారు. 75 శాతం రాయితీపై పాతర గడ్డి కిలో రూ. 2కే సరఫరా చేశారు. దాణా కూడా 75 శాతం రాయితీపై కిలో రూ.4కే సరఫరా చేసే వారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధుల కింద పశువుల సంరక్షణ షెడ్ల నిమిత్తం గోకులం, మినీ గోకులం నిర్మించారు. ఉపాధి హామీ నిధులతో ఊరూరా పశుగ్రాసం విస్తారంగా సాగు చేయించారు. అధిక సంఖ్యలో రైతులు వేసవిలో పశుగ్రాసం కొరత ఉన్న అన్నీ ప్రాంతాలకు పచ్చగడ్డి సరఫరా చేసి ఆదాయం పొందారు. వేసవి సీజన్‌లో పొలాలకు వెళ్లిన పశువులకు తాగునీటి సమస్య లేకుండా అందుబాటులో ఉన్న చేతిపంపుల వద్ద నీటి తొట్టెలు నిర్మించారు.

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత..

2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గోకులం, మినీ గోకులం పథకాలను రద్దు చేసింది. వాటిని నిర్మించుకున్న పాడి రైతులకు బిల్లులు నిలిపేసింది. అప్పటి వరకు పాడి పరిశ్రమకు సంబంధించి అమల్లో ఉన్న అన్ని పథకాలను ఆపేసింది. గత ప్రభుత్వ హయాంలో రాయితీపై దాణామృతం కిలో రూ.3కే అందిస్తుంటే దాని ధర రూ.6.50లకు పెంచేసింది.


పశుగ్రాసం లేక బక్కచిక్కుతున్న గేదెలు

రాయితీపై పాతర గడ్డి ఇవ్వని కారణంగా పల్లెల్లో పశు పోషకులు వరిగడ్డిపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరిగడ్డి ట్రాక్టరు ట్రక్కు ధర రూ.20వేల వరకు పలుకుతోంది. దీంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం పాల దిగుబడి తగ్గడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది. ఐదేళ్లుగా పాతర గడ్డి పెంపకానికి ప్రోత్సాహం అందకపోవడం, రాయితీపై దాణా ఇవ్వకపోవడంతో పాడి రైతులు తీవ్రస్థాయిలో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు



బైరెడ్డి పల్లె,ఏప్రిల్9: మండలంలోని కైగల్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళ వారం ఎస్ఐ కృష్ణయ్య కైగల్ వద్ద వాహన తనిఖీ చేపట్టారు.కూటాలవంకకు చెందిన నటరాజు ద్విచక్రవాహనంలో 864 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకున్నా రు. మద్యం విలువ రూ.34,585లు ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

● ఆరుగురి అరెస్టు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 9: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కుళాయప్ప కథనం మేరకు... ఎస్ఆర్‌పురం మండలం దిగువ ముద్దికుప్పం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి దిగువ ముద్దికుప్పం గ్రామానికి చెందిన మహలింగం, చిరంజీవి, ఆనందయ్య, జయపాల్, అరుణ్, శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని, వారి వద్ద రూ.4,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కనకాంబరం.. కిలో వెయ్యి

బంతిపూలు రూ.వంద ● ఉగాది, రంజాన్ ఎఫెక్ట్‌తో ఆకాశాన్నంటిన ధరలు


బంతిపూల తోట

పుంగనూరు, ఏప్రిల్ 9: హిందువులకు తెలుగు సంవత్సరాది, తొలి పండుగైన ఉగాది.. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పర్వదినం. ఈ సందర్భంగా పూల ధరలు సోమ, మంగళవారాల్లో అమాంతం పెరిగాయి. పుంగనూరు, పరిసర ప్రాంతాల్లో సాగయ్యే కనకంబరాల పూలు తక్కువగా రావడం, డిమాండు అధికంగా ఉండటంతో కిలో రూ.1000 ధర పలికింది. ఇక, బంతిపూల మాల రూ.200 నుంచి రూ.250 వరకు పలికాయి. నిన్నటి మొన్నటిదాకా కిలో చెండుమల్లె బంతిపూలు కిలో రూ.10 లోపే ఉండగా పుంగనూరు గంగజాతర సందర్భంగా కిలో రూ.30 నుంచి రూ.40కి పెరగ్గా ప్రస్తుతం కిలో బంతులు ఒకటో రకం రూ.120- నుంచి రూ. 100 వరకు పలికాయి. ఎక్కడ చూసినా పూల దుకాణాల వద్ద జనమే. ధర ఎక్కువగా ఉన్నా ఇళ్లలో పూజలు, దివంగతుల ఫొటోలు, సమాధుల వద్ద వేయడానికి పూల మాలలు అవసరం కావడంతో బంతిపూలతో అల్లిన మాల రూ.250తో విక్రయాలు జరిగాయి. రోజా మాలలు అయితే రూ.400 నుంచి రూ.500 వరకు పలికింది. గుండెమల్లెలు కిలో రూ. 400 నుంచి రూ.500, సన్నజాజి మల్లెపూలు కిలో రూ. 700, చామంతిపూలు రూ.300, చిట్టిరోజాలు రూ. 300నుంచి రూ.350, లిల్లీపూలు రూ.280 నుంచి రూ.300 ధరలు ఫలికాయి. ప్రజలు ధర ఎక్కువైనా పూల కొనుగోళ్లలో వెనక్కితగ్గలేదు. వర్షాలు సరిగా లేకపోవడం, గతేడాది పూల ధరలు భారీగా పతనం కావడంతో పూలు కోయడానికి వెచ్చించిన కూలీలు కూడా రాకపోవడంతో భారీగా పూల రైతులు నష్టపోయారు. దీంతో పూలపంటసాగు తక్కువగా ఉండటంతో హిందూ ముస్లింల ముఖ్యమైన పండుగలు ఒకేసారి రావడంతో ధరలు అధికంగా పెరిగాయి. కనకంబరం పూలు, చెండుమల్లె, చిట్టిరోజాపూలు, చామంతిపూలు పుంగనూరు ప్రాంతం నుంచి బయట నగరాలకు ఎగుమతి అవుతాయి. మిగిలిన పూలు బయట ప్రాంతాల నుంచి దిగుమతి అవుతాయి. ఈ ధరలు కొద్దిరోజులు ఇలాగే ఉండొచ్చని పూల వ్యాపారులు అంటున్నారు.


పుంగనూరు మార్కెట్‌లో అమ్మకాలకు ఉన్న గుండెమల్లెలు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,920 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 17,638 మంది తలనీలాలు సమర్పించారు.

జేఈఈ మెయిన్స్‌కి 10 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 9: జిల్లాలో ఈనెల 4న మొదలైన జేఈఈ మెయిన్స్ సెషన్ 2 పరీక్షలు ఐదో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. వేమూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో 121 మందికి గాను 111 మంది హాజరు కాగా, 10 మంది గైర్హాజరైనట్లు సిటీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు.

మద్యం విక్రయాలపై ఈసీ నిఘా పెంచాలి

తెలుగు యువత


మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో మద్యం విక్రయాలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) నిఘా పెంచాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 2019 ఉగాది పర్వదినాన సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామన్న చెప్పిన జగన్.. చివరకు రాష్ట్రాన్ని మద్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. గతంలో ఉన్న బ్రాండ్స్ రద్దుచేసి.. కొత్తపేర్లతో మరిన్ని ప్రవేశపెట్టి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. దీనిపై మహిళలు నిలదీయాలని పిలుపునిచ్చారు. మరోవైపు నాణ్యత లేని మద్యం విక్రయిస్తుండడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మద్యం ద్వారా గెలవాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా 3,500 దుకాణాల్లో 15వేల మంది సొంతపార్టీ కార్యకర్తలను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని ఆరోపించారు. ప్రతి దుకాణంలో టోకెన్ విధానంతో వైసీపీ కార్యకర్తల కనుసన్నల్లో అనధికారంగా మద్యం బాటిల్స్ అందజేస్తూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. అందువల్ల మద్యం విక్రయాలను ఈసీ పరిధిలోకి తేవాలని విన్నవించారు. అలాగే డిజిటల్ పేమెంట్ సిస్టం తీసుకొచ్చి, డిస్టలరీస్‌పై నిఘా పెట్టాలన్నారు. ఇప్పటివరకు జరిగిన విక్రయించిన మద్యంపై శ్వేత పత్రం విడుదల చేయాలని, ఆడిటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణయాదవ్, కర్లం సంతీప్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసులు, తోటవాసు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలు బాగుండాలంటే టీడీపీని గెలిపించండి

● చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 9: భావితరాలు బాగుండాలంటే టీడీపీని ఆదరించి, కూటమి బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం కోరారు. ఉగాది సందర్భంగా పార్లమెంటరీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన భావితరాల భవిష్యత్తు టీడీపీతోనే సాధ్యం అన్నారు. తాయిలాలకు ఆశపడి మరోసారి మోసపోయి తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకోవద్దంటూ ప్రజలను హెచ్చరించారు. ఈ ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపేలా.. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు. ముందుచూపుతో వ్యవహరించే నారా చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడి నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు అవసరమన్నారు. నాడు అన్న ఎన్టీఆర్ సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. చంద్రబాబు విజన్‌ను ప్రజలు అర్థం చేసుకుని, ఆయనకు అండగా నిలవాలన్నారు. ఆశయాలకు అనుగుణంగా పనిచేసే తమ లాంటి విద్యావేత్తలను ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీలు బలపరచిన అభ్యర్థులకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.



టీటీడీ జేఈవో బాధ్యతల స్వీకారం

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి బదిలీ అయిన క్రమంలో ఆ స్థానంలో గౌతమిని నియమిస్తూ సోమవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

సంప్రదాయబద్ధంగా ఉగాది వేడుకలు



మదనపల్లె ప్రసన్నవెంకటరమణస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



కలకడలో ఉగాది పంచాంగం శ్రవణం చేస్తున్న దృశ్యం



పీటీఎంలో అలంకరణలో స్వామివారు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9:క్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మదనపల్లె పట్టణంలోని దేవళంవీధిలో గల ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం ఆలయ అర్చకులు నూతన తెలుగు సంవత్సరాది క్రోధి నామసంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. ఈ నూతన సంవత్సం అందరి జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమణ, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో భక్తులకు శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరణ చేసి దర్శనభాగ్యం కల్పించారు. షడ్రుచులతో తయారుచేసిన ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు. అలాగే మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ కార్యాలయంలో అధ్యక్షుడు ఏఆర్ సురేష్ ఆధ్వర్యంలో ఉగా ది వేడుకలను నిర్వహించారు. రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల ఆచారి పంచాంగ శ్రవణం చేశారు.

తంబళ్లపల్లెలో: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను తంబళ్లపల్లె మండల ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి పంచాంగ శ్రవణం వినిపించారు. వేకువజామునే ప్రజలు మామిడి, వేప తోరణాలు, పూలతో ఇళ్లను అలంకరించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని దేవతలకు నైవేద్యంగా సమర్పించి అందరికి పంపిణీ చేశారు. శోభకృత్ నామ సంవత్సరానికి స్వస్తి చెప్పి క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికి ఒకరినొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇళ్లలో పూర్వీకులకు బట్టలు పెట్టి సమాధుల వద్ద పూజలు చేశారు.

పీలేరులో: క్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలను పీలేరు మండల ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉదయాత్పూర్వమే ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ పీలేరు ఖండ సభ్యులు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ తిరుపతి ఖండ ప్రచార ప్రముఖ్ మల్లిఖార్జున మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పీలేరు పట్టణంలోని పలువురు ముస్లింలు తమ పూర్వీకుల సంప్రదాయాలను గౌరవిస్తూ స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులకు భత్యం చెల్లించి మతసామర్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు పామిడి మల్లిఖార్జున గుప్తా, బియారాం, శశి, హరి, సురేశ్, కిశోర్ స్వామి, కేసర్ల బాలసుబ్రహ్మణ్యం శెట్టి, విశ్రాంత హెచ్ఎం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్రంకొండలో:మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉగాది వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే ఇళ్లలో ప్రత్యేక పూజలను చేసి ఉగాది పచ్చడిని ఆరగించారు. ఇందులో భాగంగా తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని అర్చకులు చదివి వినిపించారు.

కలకడలో:కలకడ మండల ప్రజలు ఉగాది పర్వదినాన్ని వేడుకగా జరుపుకున్నారు. ఇళ్ల ద్వారాలను మామిడితోరణాలు, వేప ఆకులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడిని ఆరగించారు. పెద్దల సమాధుల వద్ద పూజలను నిర్వహించారు. కలకడ సత్యవతి నదీ తీరాన ఉన్న ఆలయంలో కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యం స్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని ఎర్రయ్యగారిపల్లె-కలకడలో ఊరేగించారు. అలాగే బాటవారిపల్లె పంచముఖ ఆంజనేయస్వామి, ఎర్రకోటపల్లె సమీపంలోని కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అర్చకులు విజయసారథి, సుబ్రమణ్యం స్వామి పంచాంగం చేశారు. కొత్త సంవత్సరంలో వర్షాలు మధ్యస్థగా ఉండి వరి, గోధుమ పంట దిగుబడి బాగా వస్తాయని ఎర్ర రంగు కలిగిన టమోటా పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్ర మంలో మద్దిపట్ల వెంకటరమణనాయుడు, కోనేని రెడ్డెప్పనాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మల్లికార్జున్‌నాయుడు, రైస్‌మిల్ రమణ, పునీత్‌చౌదరి, రెడ్డిశేఖర్‌నాయుడు, శ్రీహరినాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కురబలకోటలో: కురబలకోట మండలంలో ఉగాది పండుగ వేడుకలను మంగళవారం ప్రజలు వైభవంగా నిర్వహించారు. కురబలకోట, అంగళ్లు, ముదివేడు, మట్లివారిపల్లె తదితర గ్రామాల్లో తెలుగు సాంప్రదాయాలు ప్రతిబింభించేలా ప్రజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం ఆలయాల్లో పండితులు శ్రవణపంచాంగాన్ని చదివి వినిపించారు.

పెద్దతిప్పసముద్రంలో: పీటీఎంలో ఉగాది పండుగను పురష్కరించుకుని ఉదయం చెన్నకేశవస్వామి ఆలయం, విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల్లో వేదపండితులచే పంచాంగ శ్రవణం చేపట్టారు రాత్రికి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాలు, కోలాటలు, చెక్క భజనలు, బళ్లారి డ్రమ్ములతో కోలాహలంగా పురవీధుల్లో ఊరేగించారు. పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తరించారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా మంగళవారం ఉగాది పండుగ వేడుకలను ఇంటింటా వైభవంగా జరుపుకున్నారు. స్థానిక పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారామలక్ష్మణులను విశేషాలంకరణలు గావించారు.

భక్తజనం హాజరు కాగా పంచాం గ శ్రవణం సాగింది. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను తిరుచ్చిలో పురవీధులలో ఊరేగించారు. ఈకార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసా చార్యులు, కృష్ణరాజుభట్టార్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సర తెలుగు ఉగాది వేడుకలను ఏపీయూఎస్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రమణారెడ్డి అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సొసైటీకాలని రామాలయంలో ఉగాది పండుగ పురస్కరించుకుని ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. సాంప్రదాయ వస్త్రధారణలో భక్తులకు హనుమాన్‌చాలీసా పాకెట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సూర్యడు మేషరాశిలో ప్రవేశించడంతో ప్రకృతిలో మార్పు వస్తుందన్నారు. వర్షాలు సకాలంలో కురవాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రజలకు ఉగాది పచ్చడి వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు హరినాథ్, సిద్దారెడ్డి, నాగేంద్రకుమార్, విద్యాధర్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోండి

చిన్నమండెం, ఏప్రిల్ 9: ప్రతిపౌరుడు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ రమేశ్‌బాబు సూచించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మంగళ వారం కొత్తపల్లి పంచాయతీలోని శ్రీరామ్‌నగర్ కాలనీ, శ్రీనివాసపురం, బోరెడ్డిగారిపల్లె, కలిబండ గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. రాబోవు ఎన్నికల్లో ఎలాం టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు అనునిత్యం అందుబాటు లో ఉంటాయని ప్రజలకు భరోసా కల్పించేందుకు ఈ కవాతు అని ఎస్ఐ అన్నారు.

సిద్దవటం: మండలంలోని మూలపల్లెలో మంగళవారం పల్లెదర్శిని కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్షన్ నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. 50వేల రూపాయలు మించి నగదు తీసుకెళ్లరాదని అలా తీసుకెళ్లాలంటే వాటికి తగిన పత్రాలను చూపించాలన్నారు. గ్రామాల్లో గొడవలకు అల్లర్లకు పాల్పడవద్దని ఒక వేళ ఎక్కడైనా గొడవలు జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించా లని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు మూలపల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవాలు ప్రారంభం

రామాపురం, ఏప్రిల్ 9: తెలుగు సంవత్సరాది ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు సీతారాముల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మం డలంలోని నీలకంఠ్రావుపేటలోని సీతారామ లక్ష్మణ హనుమంత ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాలు మంగళవారం ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు ప్రతి రోజు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు దేవాల యంలో విశేష పూజలు, భక్తిగీతాలాపనలు, భజనలు, నవమి రోజున సీతారాముల కల్యాణం, రాత్రికి బ్రహ్మో త్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గరికతో గణపతికి అలంకరణ

నందలూరు, ఏప్రిల్ 9 : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే ఉన్నవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరిం చుకొని గణపతి ని గరికతో అలంకరించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌శర్మ పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున పూజలలో పాల్గొని తమ మొక్కులను తీర్చుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం జరగాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 9: ఈ ఏడాది ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామని ఆపస్ జిల్లా మీడియా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉగాది సందర్భంగా స్థానిక శ్రీలక్ష్మి వెంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించి ఉగాది పచ్చడి భక్తులందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు న్యాయం జరగాలని, 11వ పీఆర్‌సీ తొందరగా అమలు కావాలని కోరుకుంటున్నామన్నారు. అలాగే ఉపాధ్యాయ సమస్యలు, మెగా డీఎస్సీపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గడియాల వెంకటసూర్యప్రసాద్, పురోహితుడు శ్రీహరిస్వామి, గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు రాజాసేవ కరీంనగర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు



అలంకరణలో చౌడేశ్వరీదేవి



అమ్మవారి దర్శనానికి వేసిఉన్న భక్తులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9: స్థానిక నీరుగట్టువారిపల్లెలో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి ఉగాది జ్యోతి ఉత్సవాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. తొగటవీరక్షత్రియుల ఆరాధ్యదైవం చౌడేశ్వరీ అమ్మవారిని తొగటవీరక్షత్రియులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. సాయంత్రం ఆలయం ఆవరణలో ఏర్పాటు చసిన అగ్నిగుండ ప్రవేశం చేసిన భక్తులు చౌడేశ్వరీదేవి జ్యోతులను మేళతాళాలతో ఊరేగింపు నిర్వ హించారు. అంతకుముందు ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి జాతరకు వేలాదిగా తరలివచ్చిన భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణి చేశారు. మహిళలు ఉదయం నుంచి దీలు బోనాలు ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి సమర్పించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి పుష్పపల్లకిలో ప్రత్యేక వాహంలో బళ్లారి డ్రమ్స్ నడుమ అత్యంత వైభవంగా ఊరేగింపు చేశారు. నీరుగట్టువారిపల్లె చుట్టుపక్కల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని అమ్మవారిని పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులతో పాటు టూటౌన్ సీఐ యువరాజ్, వన్‌టౌన్ సీఐ వల్లీబషు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ యువరాజ్ మాట్లాడుతూ జాతరకు వేలాదిగా తరలివచ్చి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 20 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్యోతి ఉత్సవ, ఆలయకమిటీ అధ్యక్షుడు ఉప్పురామచంద్ర, కార్యదర్శి గుండ్లపల్లె ప్రభాకర్, ట్రెజరర్ రామి శెట్టి లోకేష్, ఆలయకమిటీ సభ్యులతోపాటు మాజీ కౌన్సిలర్లు రామిశెట్టి నీలకంఠ, బండినాగరాజ, పురాణం చంద్రశేఖర్, మోడెం సిద్దప్ప, మోడెంరాజు, గుండ్లపల్లె లక్ష్మీనారాయణ, ప్రెస్ రమణ, కమల మరికృష్ణ, నాగరాజ, రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెవాసులకు తాగునీటి కష్టాలు

● పండుగల రోజున అవస్థలు పడుతున్న ప్రజలు ● ట్యాంకర్ల వద్ద నీటి కోసం జనాల పాట్లు



: ట్యాంకు వద్ద నీరుపట్టుకోవడానికి తిప్పలు పడుతున్న మహిళలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9: రెవెన్యూ డివిజనల్ కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రం, మున్సిపల్ కేంద్రంగా ఉన్న మదనపల్లెకు తాగు నీటికష్టాలు తప్పడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వేసవి ఎండలు ఒక వైపు భగభగ మండుతుంటే మరోవైపు బిందెడు నీటికోసం తమ అగచాట్లు ఎవరికి చెప్పాలంటూ ప్రజలు మండపడుతున్నారు. మున్సిపాలిటీ పన్నులు కట్టించుకొంటున్న అధికారులకు మాత్రం ఈ నీటి కష్టాలు కానరాలేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. మదనపల్లె పట్టణంలోని చౌడేశ్వరీ కళ్యాణమండపం సమీపంలోని ప్రాంతాల్లో జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో పైపులైన్లు పాడైపోయి నాలుగు నెలలు గడుస్తున్నా అధికారులకు ఏమి పట్టడంలేదు. దీంతో అమ్మచెరువుమిట్ట, చంద్రాకాలనీ, జహేచేనేతనగర్, కనకదాస్‌నగర్, సిరికల్చర్‌కాలనీ, వాల్మీకినగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో తాగునీరు సరఫరా సరిగాలేక నాలుగు నెలలు పూర్తికావస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రతి నెల మూడు ట్యాంకు చొప్పన ఒక్కొక్క ట్యాంకు ధర 600లతో రూ. 2వేలు వరకు ఖర్చుఅవుతందని చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే 35 వార్డులోని మారుతీనగర్‌లో మూడు రోజులుగా పెపులైన్లు దెబ్బతిని పైపులైన్లు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో చేసేదిలేక మున్సిపల్ ట్యాంకర్లతో మంగళవారం నీటిని సరఫరా చేశారు. మంగళవారం ఉగాది పండుగకావడంతో ప్రజలు నీరు సకాలంలో అందుబాటులోలేక అగచాట్లు పడ్డారు. ఒకటి, రెండు రోజుల్లో రంజాన్ పండుగ కూడ వస్తుండడంతో తాగునీటి అవస్థలు ఇలా ఉంటే ఎలాగంటూ ప్రజలు అధికారుల తీరును ఎండగడుతున్నారు. గతంలో కూడా పైపులైన్ల మరమ్మతుల కోసం గోతులు తవ్వి అలాగే వదిలేశారని ప్రజలు చెబుతున్నారు. తక్షణమే దెబ్బతిన్న పైపులైన్లు మరమ్మతులు చేసి ఇంటింటికి తాగునీటి సరఫరా చేయాలని పట్టణవాసులతోపాటు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు.

నేటి నుంచి మంచాలమ్మ జాతర





రామాపురం, నందలూరుల్లో ప్రత్యేక అలంకరణలో మంచాలమ్మ

రామాపురం, ఏప్రిల్ 9: మండలం లోని రాచపల్లె పంచాయతీ గంగనేరు క్వాటర్స్ సమీపంలో బుధ, గురువారా ల్లో మంచాలమ్మ జాతర నిర్వహిస్తు న్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం అ మ్మవారిని ఆలయంలోనికి తీసుకువ స్తారు. మొక్కుబడి ఉన్న వారు, సంతానం కావాల్సిన వారు ఆలయం వద్ద వరపడుతారు.అనంతరం పూజ లు చేస్తారు. మొక్కుబడులు ఉన్న వారు బుధవారం రాత్రి చాందినీ బం డ్లు ఆలయంచుట్టూ తిప్పుతారు. ఈ సందర్భంగా చెక్కభజనలు, సాంస్కృతి క కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ జాతరకు మండలంలోనే కాకుండా అన్నమయ్య జిల్లా, కడప జిల్లాల నుంచి ప్రజలు అధిక సంఖ్యంలో మహిళా భక్తులు పాల్గొంటారు.

నందలూరు: మండలంలోని ఆడపూరు గ్రామంలో మంగళవారం మంచాల మ్మ తిరుణాల నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరం గా అలంకరించారు. ఈ ఉత్సవానికి కర్ణాటక నుంచి భక్తులు హాజర య్యారు. ఆలయ నిర్వాహకులు అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆడపూరు పంచా యతీలోని పలు గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌పైనే రాష్ట్ర భవిష్యత్తు : ముక్కా



ప్రచారం చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 9: రాష్ట్ర భవిష్య త్తు బాగుండాలంటే ఉమ్మడి కూటమి అభ్యర్థు లు విజయం సాధించాలని రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపా నందరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కుక్కలదొడ్డి పం చాయతీలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్, టీడీపీ బీజేపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సార్లు గెలిచిన వైసీపీ అభ్యర్థి కోడూరు అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. ఒకసారి అవకాశం ఇచ్చి ఉమ్మడి అభ్యర్థిని గెలి పిస్తే కోడూరును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. . ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి, ముక్కా రూపానందరెడ్డి సతీ మణి వరలక్ష్మి, తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, వెంకటేష్, చంద్రశేఖర్, ఉత్తరాది శివకుమార్, కిషోర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

● ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ సీఎం కిరణ్, కిశోర్‌కుమార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కిరణ్‌కుమార్ రెడ్డి, కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 9: సంస్కృతీ, సంప్ర దాయాలకు పండుగలు ప్రతీకలని మాజీ సీఎం, ఎన్డీఏ కూటమి రాజం పేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కు మార్‌రెడ్డి, ఆయన సోదరుడు పీలే రు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. కలికిరిలో మంగళవారం రాత్రి ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు. కాకతాళీయంగా మంగళవా రం తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం కావడంతో పరస్పరం శుభాకాంక్షలు చెప్పు కున్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి ముస్లింలతో కలిసి సామూ హిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం మాజీ రాష్ట్ర కమిషనరు ఇంతి యాజ్ అహ్మద్ కూడా మాజీ సీఎంతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం హిందూ ముస్లింలు నాయకులతో కలిసి పరస్పర శుభాభినందనలు చెప్పుకున్నారు కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముతవల్లీలతోపాటు నాయకులు ఏజాజ్ అహ్మద్, కలికిరి సర్పంచు ప్రతాప్‌కుమార్ రెడ్డి, చంద్రకుమార్‌రెడ్డి, లక్ష్మీకర్ రెడ్డి, ఆనంద రెడ్డి, చంద్రశేఖర్, నిజాముద్దీన్, వేంపల్లె అబ్దుల్ ఖాదర్, సమీవుల్లా, జాఫర్, రహంతుల్లా, లేపాక్షి ఎసానుల్లా, వలీవుల్లా, షాబుద్దీన్, అఫ్రోజ్, మునాఫ్, మహ్మదాలి, మున్వర్, వైజాగ్ బాషా, కాదర్‌వల్లీ, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని ఆదరించి.. గెలిపించండి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 9: ఎన్ని కల్లో కూటమి ప్రభుత్వాన్ని ఆదరిం చి.. గెలిపించాలని మదన పల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూట మి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నా రు. స్థానిక ఎస్‌టీఐ కాలనీలో పలు వురు పురప్రముఖులను కలసిన షాజహాన్‌బాషా, మంగళవారం సా యంత్రం ఇందిరానగర్‌లో టీడీపీ మై నారిటీ నాయకులు గౌస్‌ఆజం, అఫ్రోజ్ ఖాన్, నౌషాద్, ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని బొమ్మచెరువు పంచాయతీలో తెలుగు యువత నాయకుడు బి.ముద్దుకృష్ణమనాయుడు ఆధ్వర్యంలో షాజహాన్‌బాషా ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లిన షాజహాన్‌బాషా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమం తో పాటు, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బొమ్మచెరువు గ్రామానికి చెందిన సిద్దులు, శ్రీరాములు, కమలా కర్, గోపాల్, బయన్న, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి షాజహాన్ బాషాపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 9: మదనపల్లి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి షాజహాన్ బాషా, రాజంపేట టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత మార్చి నెల18న మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతి ఎగువమాచిరెడ్డిగారి పల్లెలో ఎలాంటి అనుమతి లేకుండా షామియానా వేసి సమావేశం నిర్వహించి ఎన్నికల నియమావళి ఉల్లంఘించి ప్రచారం చేయడంతో 41ఎ కేసు నమోదు చేశామన్నారు. అయితే కేసు నమోదు చేసిన 20రోజుల తరువాత నోటీసులను సోమవారం దిగువపల్లెలో జరిగిన టీడీపీ సమావేశంలో వారికి అందించారు. దీంతో నోటీసులను తీసుకొన్న అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ మాట్లాడుతూ కేసు నమోదు చేసి 20రోజులు కావస్తుంటే పోలీసులు తీరిగ్గా నోటీసులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. అలాగే తాము బ్యానర్లు, మైకుసెట్టు ఉపమోగించలేదని కావాలనే తమపై వైసీపీ నాయకులు పిర్యాదు చేసివుంటారని తెలిపారు. వైసీపీ నాయకుల ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ ప్రభంజనాన్ని అపలేరని వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అన్నారు.

విజన్ ఉన్న నాయకుడు జయచంద్రారెడ్డి



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 9: విజన్ ఉన్న నాయకుడు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి అని టీడీపీ సీనియర్ నాయకుడు దేరంగుల చంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండలం లోని గోపిదిన్నె దళితవాడలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రా మంలో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటేసి సీఎంగా చంద్రబాబును, ఎమ్మెల్యేగా జయచంద్రారెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ప్రజలందరూ ఆలోచించి టీడీపీకి ఓటేసి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీష్, భాస్కర్, శ్రీనివాసులు, హరిప్రసాద్, గంగాధర్, రాజేష్, సాయి కుమార్ పాల్గొన్నారు.

పంట ఎండిపోతోంది.. ఆదుకోండంటూ రైతు వినతి



ఎండిన పంటను చూపుతున్న రైతు రమణ

వాల్మీకిపురం, ఏప్రిల్ 8: పంట నిలువునా ఎండిపోతోంది.. ఆదుకోవా లంటూ రైతు అధికారులకు విన్నవించా రు. వివరాల్లోకి వెళితే.. వాల్మీకిపురం మండలంలోని జర్రా వారిపల్లె గ్రామానికి చెందిన అంధ రైతు రమణ(50) తన పంట ఎండిపోతోందంటూ అధికారులను ఆశ్రయించాడు. గ్రామంలో తన భార్య సహాయంతో సర్వే నెంబరు 432లో 5.5ఎకరాల తన భూమిలో బోరు వేసుకుని అప్పులతో పంటను సాగు చేశానన్నాడు. ఇటీ వల తన బోరుబావి మరమ్మత్తుకు గురైందని మోటర్‌ను వెలికి తీసి మరమ్మతులు చేపట్టే సమయంలో గ్రామానికి చెందిన వారే అడ్డుపడి వికలాంగుడని చూడకుండా పం ట సాగును ఎండిపోయేలా చేస్తున్నారని ఆరోపించారు. 3ఎకరాలలో బెండ, ఖాలీఫ్లవర్ పంటలు సాగు చేసి చేతికందే సమయంలో బోరు చెడిపోయి మరమ్మతులకు కూడా సహకరించక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నాడు. ఈ విషయమై గతవారం రోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేశానని అయితే అధికార పార్టీ నాయకులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తను సాగు చేస్తున్న పంటలకు నీరు పెట్టే విధంగా న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యాసామగ్రి ధ్వంసం

● రూ. లక్ష ఆస్తి నష్టం ● పోలీసులకు పిర్యాదు



పాఠశాల మురుగుదొడ్డిలో కుళాయిల ట్యాప్‌లు పగులకొట్టిన దృశ్యం

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 9 : మండలంలోని రంగసముద్రంలో గ్రామ నడిబొడ్డులో ఉన్న మం డల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి పాఠశాలలో ఉన్న విద్యా సామగ్రిని దుండ గులు ధ్వంసం చేసినట్లు ఆ పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రామచంద్రయ్య పోలీసులకు పిర్యా దు చేశారు. ఈ సందర్బంగా పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు సంబందించిన విద్యా సామగ్రితో పాటు మరుగు దొడ్లలో ఏర్పాటు చేసిన నీటి కుళాయిలను సైతం ధ్వంసం చేశారన్నారు. దీనిపై మంగళవారం పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఒలింపియాడ్‌లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9: జాతీయ స్థాయి ఒలంపియాడ్ పరీక్షల్లో గ్రాండ్ ప్రైజ్ లెనోవా ల్యాప్‌టాప్‌ను స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని శ్రీచైతన్య టెక్నోస్కూల్ విద్యార్థిని బి. రిషిత గెలుకున్నారు. మంగళవారం విద్యార్థిని తల్లిదండ్రుల సమక్షంలో శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం సురేష్, శ్రీపద్మావతి మహి ళా యూనివర్సిటీ ప్రొఫెసర్ బి. కిషో రి చేతులమీదుగా అంద జేశారు. జనవరిలో జాతీయ స్థాయి ఒలంపియాడ్ నిర్వ హించిన పరీక్షల్లో ప్రతిభ కనపర్చారు. కార్యక్రమంలో ఆర్ఐపీ శ్రీధర్, ప్రిన్సిపాల్ ఆర్.విజ యలక్ష్మీ, హేమావతి, దీన్‌బోగేస్, నూర్‌అహ్మద్, రహీమ్ పాల్గొన్నారు.